



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE


సంపుటి : 8 | సంచిక : 332 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 18 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి

- రాష్ట్రాలకు ప్రధాని మోదీ పిలుపు
- ఢిల్లీలో రూ.11వేల కోట్ల హైవే ప్రాజెక్టుల ప్రారంభం
- చిన్న, భారీ వ్యాపారులకూ మేలు చేస్తుంది
- జీఎస్టీ చట్టాన్ని మరింత సరళీకరించాలి
- పన్ను రేట్లను సవరించాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది
- "సంస్కరణలు సుపరిపాలన పురోగతిని సూచిస్తాయి.

# బాధ్యత ఉండొద్దా



**టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్**

- మీరు చేసే పనులకు పార్టీ నష్టపోవాలా?
- కొందరు ఎమ్మెల్యేల తీరుపై సీఎం సీరియస్
- ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉంటాం
- పదవుల్లో ఉన్నారు.. అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర నాయకత్వానికి ముఖ్యమంత్రి ఆదేశం
- ఫ్రీ బస్సులపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పథకాలపై ప్రజలతో మమేకం కావాలి
- ఆమదాలవలస, గుంటూరు తూర్పు,అనంత ఎమ్మెల్యేలపై నివేదిక ఇవ్వండి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కొందరు ఎమ్మెల్యేలు, నేతలు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వారు చేసే తప్పులకు పార్టీ ఎందుకు నష్టపోవాలని నిలదీశారు. ఇలాంటి విషయాల్లో ఇక కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. బాధ్యతగల పదవుల్లో ఉన్నప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ప్రభుత్వ పథకాల అమలుపై చంద్రబాబు టీడీపీ శ్రేణులతో ఆదివారం - మిగతా2లో

## 5 జిల్లాలకు రెడ్ అలర్ట్



- విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమలో కుంభవృష్టి కురిసే అవకాశం
- అల్పపీడనం.. వాయుగుండమయ్యే చాన్స్
- ఓడరేవుల్లో మూడో నంబరు హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన
- విపత్తుల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101 విడుదల


**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత 24 గంటల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ దిశగా పయనించనుంది. రుతుపవన ద్రోణి తూర్పుభాగం ఆదివారం నాటికి జగదల్‌పూర్ నుంచి బంగాళా ఖాతం వరకు విస్తరించింది. ఛత్తీస్‌గఢ్‌లోని మరో అల్పపీడనం ఆదివారం విదర్భ వద్ద కేంద్రీకృతమైంది. ఇంకా బంగాళాఖాతంలోని అల్పపీడనం నుంచి ఉత్తరాంధ్ర, ఛత్తీస్‌గఢ్, విదర్భ, గుజరాత్ మీదుగా అరేబియా సముద్రం వరకు తూర్పు, పడమర ద్రోణి విస్తరించింది. వీటన్నింటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలపడి - మిగతా2లో

## భాజపాను అఫిడవిట్ అడగలేదేం!

- ఈసీ బెదిరింపులకు భయపడను: రాహుల్
- బిహార్‌లో మొదలైన 'ఓటర్ అధికార్ యాత్ర'
- 'ఓటర్ అధికార్ యాత్ర'లో రాహుల్, తేజస్వి





## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

- ఎన్డీయే తరఫున బరిలోకి
- తమిళనాడు ఓబీసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ

## ఢిల్లీలో లోకేశ్

- నేడు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- పెండింగ్ ప్రాజెక్టులపై చర్చ
- వివిధ ప్రతిపాదనల సమర్పణ
- 21న వెళ్లనున్న సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆదివారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. సోమవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు. సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర ఐటీ–ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ, షిప్పింగ్– జలరవాణా మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, - మిగతా2లో

## మాకు న్యాయం చేయండి



- వేర్వేరు మాధ్యమాల పేపర్లకు కలిపి ఒకే విధంగా నార్మలైజేషన్
- దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.. డీఎస్సీ రాసిన అభ్యర్థుల ఆవేదన
- నిబంధనలు పాటించాం: కన్వీనర్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

పేపర్ల నార్మలైజేషన్ ప్రక్రియపై డీఎస్సీ అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్షలో వేర్వేరు మాధ్యమాల పేపర్లకు ఒకేరకంగా నార్మలైజేషన్ చేయడంవల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షల్లో భాగంగా జూన్ 12న స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్ష జరిగింది. ఉదయం సెషన్‌లో తెలుగు మీడియం అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా 20,254 - మిగతా2లో

## భారత్‌కు తిరిగొచ్చిన గగన యాత్రికుడు

- శుభాంశు శుక్లాకు ఢిల్లీలో ఘనస్వాగతం
- నేడు మోదీతో భేటీ



# వైసీపీ వాళ్లు చెప్పారు... టీడీపీ వాళ్లు చేసి చూపించారు

విజయవాడ

పులివెందులలో జెడ్పీ ఎన్నికల్లో ఘోర పరాభవానికి కుప్పంలో లింక్ ఉందా..అప్పటి అత్యుత్సాహమే ఇప్పటి ఓటమికి కారణమైందా అన్నవిశ్లేషణలు వస్తున్నాయి. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పంను కొల్లగొట్టి.. వై నాట్ కుప్పం అంటూ చేసిన అతి చర్యలవల్లే ఇప్పుడు జగన్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం అంటోంది. వై నాట్ 175 అంటూ అప్పట్లో జగన్ కుప్పం ను కూడా కలుపుకునే అన్నారు. దానికి ప్రతిగా చంద్రబాబు వైనాట్ పులివెందుల అంటూ సవాల్ చేశారు.అప్పట్లో జగన్ అయినా.. చంద్రబాబు అయినా కూడా ముఖాముఖీగా వాళ్ల నియోజకవర్గాలను కూడా ఓడిస్తామని సవాల్ చేశారు. అది జరగలేదు కానీ.. ఏడాది తర్వాత పులివెందులలో వైసీపీని టీడీపీ చావు దెబ్బ కొట్టింది. వైఎస్ కుటుంబానికి ఓటమంటే తెలియని పులివెందులలో అదీ ఆ మండలంలో వైసీపీని డిపాజిట్ కూడా రాకుండా ఓడించడం వెనుక చాలా సంగతే ఉంది. క్యాడర్ కష్టపడిందా.. అధికారంతో అక్రమాలు చేసిందా.. ప్రత్యర్థులను భయపెట్టిందా.. లేక జగన్‌పైనే వ్యతిరేకత వచ్చిందా.. ఇలా ఎన్నిరకాల వాదనలున్నా.. సరే మొత్తానికి ఆన్ రికార్డ్ టీడీపీ అక్కడ గెలిచింది. దీనికి కారణం కుప్పం..సాధారణంగా ముఖ్యమంత్రి అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలు అంత దృష్టి పెట్టవ్.. వాళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేత నియోజకవర్గంలో రాజకీయ ఫిరాయింపులని ప్రోత్సహించడం లాంటివి కూడా చేయరు.. అదంతా వైఎస్ చంద్రబాబు జమానా వరకూ సాగింది. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 2017లో కడప జిల్లాలో బీటెక్ రవిని స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ గెలిపించుకోగలిగింది. చంద్రబాబు తన జిల్లాలో రాజకీయం చేస్తే.. జగన్ ఏకంగా ఆయన నియోజకవర్గంలోనే చేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పం మునిసిపాలిటీతో పాటు.. నియోజకవర్గంలోని అన్ని జెడ్పీటీసీలను.. ఎంపీటీసీలను కూడా వైసీపీ కైవసం చేసుకుంది.పులివెందులో టీడీపీ దౌర్జన్యాలు చేసిందని.. ఓటర్లను బయటకు రానివ్వకుండా రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. మరి ఆ రోజు.. కుప్పంలో జరిగింది కూడా అదే. కుప్పం మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. జర్నలిస్టులను కూడా కొట్టారు. ఆ నియోజకవర్గం మొత్తం టీడీపీ బయటకు రాకుండానే చేశారు.కుప్పంలో చంద్రబాబు అప్పటికే 7సార్లు ఎమ్మెల్యే. ప్రత్యర్థి పార్టీకి అంతగా పట్టు లేదు. కానీ 2021లో కుప్పం పరిధిలోని 89 పంచాయతీల్లో వైసీపీ 74చోట్ల గెలిచింది. నియోజకవర్గంలోని 4 మండలాలు వైసీపీ పరం అయ్యాయి. ఇక నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో అయితే.. ఏకంగా 17వేలు, 16వేలు, 11 వేల చొప్పున మెజార్టీలు వచ్చాయి. 68 ఎంపీటీసీ స్థానాల్లో 63 వైసీపీవే..! పెద్దిరెడ్డి కుప్పంలోనే క్యాంప్ వేసి మరీ ఎన్నికల్లో ఈ రిజల్ట్ తెప్పించారు. “చంద్రబాబు ఇలాకాలో 90శాతానికి పైగా సీట్లు అప్పట్లో వైసీపీ తన ఖాతాలో వేసుకుంది. మరిప్పుడు ఒక్క చోట ఓడిపోతేనే గగ్గోలు పెడుతున్నారు ఎందుకు” అంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కుప్పంలో గెలుపొందిన వైసీపీ అక్కడితో



ఆగలేదు.. చాలా అత్యుత్సాహం ప్రదర్శించింది. చంద్రబాబు ఓడిపోయాడని.. కూలిపోయాడని... ప్రచారం ప్రారంభించింది. జెడ్పీ ఓట్ల లెక్కల ప్రకారం చంద్రబాబు కంటే 62వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పింది. దీనికి కుప్పం మునిసిపాలిటీమెజార్టీ అదనం.. అది కూడా కలుపుకుంటే 75వేల ఓట్లు మెజార్టీ...వైనాట్ 175 స్లోగన్‌కు అదే బీజం కూడా..! అప్పట్లో నియోజకవర్గం మొత్తం కొల్లగొట్టిన వైసీపీ ఇప్పుడు రెండు జెడ్పీటీసీ ఓటములను జీర్ణించుకోలేకపోయింది.వైసీపీ లెక్క ప్రకారం చంద్రబాబుకు అప్పటికే ఉన్న మెజార్టీని దాటుకుని 75వేలు ఓట్లు పెరిగాయంటే.. దాదాపు లక్ష ఓట్లు టర్న్ అయినట్లు. కానీ 2024 రిజల్ట్ మాత్రం వేరు. చంద్రబాబు తనకు అంతకు ముందు వచ్చిన దానికంటే.. 18వేలు పెంచుకున్నారు. మరి ఈ లక్ష ఓట్లు ఏమయ్యాయి. ఇక జగన్ తనకు ఉన్న 90వేల మెజార్టీ నుంచి 60వేలకు పడిపోయారు. దీనిని బట్టే పులివెందులలో జగన్ ప్రాభవం తగ్గినట్లు కనిపిస్తోంది. అప్పట్లో కుప్పం ఒక్కదానితోనే ఆగలేదు.. జిల్లా మొత్తంలో 65 జెడ్పీ స్థానాలుంటే.. 65 వైసీపీనే గెలిచింది. ఇందులో ఏకంగా 33 స్థానాలు ఏకగ్రీవాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఎంజాయ్ చేసిన వైసీపీ ఇప్పుడు రెండు ఓటములను తీసుకోలేకపోతోంది.కుప్పంలో జరిగిన హంగామాను తెలుగుదేశం చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే పులివెందులను టార్గెట్ చేసింది. జగన్ నేరుగా ఓడించడం సాధ్యం కాదు అని తెలిసి.. అక్కడ దెబ్బకొట్టడానికి తగిన అవకాశం కోసం చూసింది. మరో ఏడాదిలోనే స్థానిక ఎన్నికలున్నాయి. మామూలుగానే టీడీపీ స్థానిక ఎన్నికలను వేగంగా పెట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక పెట్టడం.. అది కూడా పులివెందులలో పెట్టడం అంటే ఓ రకంగా రిస్క్ తీసుకున్నట్లు అర్థం. లోకేష్ నేరుగా ఇన్వాల్వ్ అయి... పులివెందుల ఎన్నికకు చొరవ చూపినట్లు తెలుస్తోంది. కచ్చితంగా గెలిచి తీరాలన్న టాస్క్ ఇచ్చిన తర్వాత.. గెలిచి తీరతామన్న నమ్మకంతోనే ముందుకెళ్లారు. జగన్‌ను మొన్నటి ఎన్నికల్లో ఎదుర్కొన్న బీటెక్‌రవి భార్య లతా రెడ్డిని రంగంలోకి దింపారు. గురి చూసి వైఎస్ కుటుంబం కుంభస్థలాన్ని కొట్టారు.కుప్పంలో తెలుగుదేశం నాలుగు చోట్ల కలిపి 20వేల ఓట్లు అయినా సాధించింది. కానీ.. పులివెందులలో వైఎస్సార్సీపీకి డిపాజిట్ రాలేదు. 7వేలకు పైగా ఓట్లు పోలైతే... 683 ఓట్లు మాత్రమే వచ్చాయి. తెలుగుదేశం అసలు ఓటర్లను ఇళ్లనుంచి బయటకు రానివ్వకుండా మొత్తం రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపణ. చాలా చోట్ల దొంగ ఓట్లు వేసిన ఆధారాలను ఆ పార్టీ అధినేత బయటపెట్టారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఇవే తరహా ఆరోపణలు కుప్పం ఎలక్షన్‌లోన వచ్చాయి. మేం రిగ్గింగ్ చేసుకుంటే.. “ఓటింగ్ 74శాతమే ఎందుకవుతుంది.. 90శాతం చేసుకునే వాళ్లం కదా..” అని టీడీపీ అంటోంది.తెలుగుదేశం దూకుడుగా వెళ్లినట్లు కనిపిస్తున్నా.. కొన్ని చోట్ల వైసీపీ ఓటర్లు కూడా ఓటింగ్‌కు నిరాసక్తత చూపారు. కొన్నేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్ అవినాష్‌రెడ్డి హవానే సాగుతోంది. జగన్ సొంత నియోజకవర్గంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వైఎస్ అవినాష్‌పై కోపం ఉన్న వాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా చేస్తే అయినా జగన్‌కు విషయం అర్థం అవుతుంది అనుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. సరే ఏదైతే ఏంటి.. మొత్తానికి మొట్టమొదటి సారి తెలుగుదేశం పులివెందులలో జెండా ఎగరేస్తే.. 45ఏళ్ల తర్వాత వైఎస్ కుటుంబం ఓటమిని ఎదుర్కొంది. వై నాట్ కుప్పం అంటూ ఆరోజు.. చేసిన దానికి వై నాట్ పులివెందుల అంటూ వీళ్లు బదులిచ్చారు.

# అమరావతిలో పెరిగిన రియల్ ఎస్టేట్

విజయవాడ

అమరావతి రాజధానినిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చాలా రకాల ప్రాజెక్టుల పనులు ప్రారంభం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం తమకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. మరోవైపు ప్రైవేటు కంపెనీలు సైతం తమ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం పార్లమెంటులో చట్టం చేసేందుకు సిద్ధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అమరావతి రాజధానికి గతంలో ఎదురైన పరిణామాలు? భవిష్యత్తులో ఎదురు కాబోవని అంతా భావిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అమరావతి రాజధాని లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడం విశేషం. పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి వైపు వస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు తో పాటు కృష్ణా జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది.2014లో అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీఅందరి అభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. దీంతో అమరావతి రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు భారీగానే సాగాయి. పెద్ద ఎత్తున వెంచర్లు కూడా పడ్డాయి. అంతేకాదు హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేకమంది వచ్చి ఇక్కడ భూములు కొనుగోలు చేయడం ప్రారంభించారు. వెంచర్లలో ప్లాట్లను కూడా కొనుగోలు చేశారు. దీంతో అప్పట్లో రియల్ ఎస్టేట్ భారీ స్థాయిలో ముందుకు సాగింది. పొరుగు రాష్ట్రాలకు ధీటుగా ముందుకు సాగింది. కానీ 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. మూడు రాజధానుల అంశం తెరపైకి రావడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రశ్నార్థకంగా మారింది. కనీస కార్యకలాపాలు నిలిచిపోవడంతో అమరావతి అటవీ



ప్రాంతంగా మారిపోయింది. రియల్ ఎస్టేట్ రంగం అమాంతం పడిపోయింది. ఆ రంగంలో పెట్టుబడులు పెట్టినవారు తీవ్రంగా నష్టపోయారు.వాస్తవానికి జగన్ మోహన్ రెడ్డి సైతం అమరావతి రాజధానిని కొనసాగిస్తారని అంతా భావించారు. కానీ ఆయన అనూహ్యంగా చంద్రబాబును దృష్టిలో పెట్టుకుని మూడు రాజధానులు అంశాన్ని తెరపైకి తెచ్చారు. 2020లో మూడు రాజధానుల ప్రతిపాదన చేయడంతో ఒక్కసారిగా అమరావతిలో రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఆ తరువాత వ్యాపార వర్గాలు హైదరాబాదును ఎంచుకోవడంతో అక్కడి ప్రభుత్వం వ్యాపారులను స్వాగతించింది. అప్పట్లోనే ఏపీలో జగన్ ఉంటే తమ వ్యాపారాలు బాగుంటాయని తెలంగాణ పాలకులు వ్యాఖ్యానించే పరిస్థితి వచ్చింది. గత ఐదు సంవత్సరాల్లో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వెయ్యలేదు. దీంతో దాదాపు 50 వేల ఎకరాల భూములు అడవిలా మారిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. వాస్తవానికి టీడీపీ కూటమి వచ్చిన వెంటనే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. అయితే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ రంగం విస్తృతికి అక్కడి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. దీంతో తొలి ఏడాదిలో అమరావతి వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చూడలేదు. దీనిని గుర్తించిన సీఎం చంద్రబాబు అమరావతిని విస్తరించి ప్రయత్నాలను చేసి చూపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం అమరావతిలో ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్లు భారీ ఎత్తున కనిపిస్తున్నాయి. వందలాది, వాహనాలు యంత్రాలు, కార్మికులు, ఉద్యోగులతో కళకళలాడుతూ కనిపిస్తోంది. ప్రస్తుతం తుళ్లూరు, వెంకటాయపాలెం, మంగళగిరి ప్రాంతాల పరిధిలో రోజుకు కనీసం 20 నుంచి 30 రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించిన లావాదేవీలు జరుగుతున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికైతే అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం విశేషం.

## ఢిల్లీలో లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కూడా ఆయన భేటీ అవుతారు. పెండింగ్ ప్రాజెక్టులపై చర్చిస్తారు. రాష్ట్రప్రభుత్వం తరఫున వివిధ ప్రతిపాదనలను వారికి సమర్పిస్తారు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు 21న ఢిల్లీ వెళ్లనున్నారు. 22న పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు.

**స్వాతంత్ర్య పోరాటాన్ని జగన్ అవమానించారు: లోకేశ్**

స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేయకపోవడం జగన్ అహంకారానికి నిదర్శనమే కాకుండా స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానించడం కూడా అని మంత్రి లోకేశ్ అన్నారు. దేశాన్ని అవమానించినందుకు ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ‘ఎక్స్’లో డిమాండ్ చేశారు. ‘వైఎస్ జగన్ ఇన్సల్ట్స్ నేషన్’ అని ట్యాగ్ లైన్ పెట్టారు.

## బాధ్యత ఉండొద్దా

-మొదటిపేజీ తరువాయి

టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలపై ఇటీవల కాలంలో వచ్చిన విమర్శలు, ఆరోపణలపై ఆయన సీరియస్ అయ్యారు. ముఖ్యంగా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై కేజీవీబీ ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను సీఎం ప్రస్తావిస్తూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలనూ తప్పుబట్టారు. ఈ ముగ్గురి కారణంగా వచ్చిన విమర్శలు, తలెత్తిన వివాదాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలతో పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల వ్యవహారశైలి చిన్న విమర్శకు కూడా ఆస్కారం ఇచ్చేలా ఉండకూడదని పదే పదే చెబుతున్నా తీరు మార్చుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు వ్యక్తిగతంగా చేసే పనులు పార్టీకి చెడ్డ పేరు తెస్తాయన్నారు. ఆయా వ్యవహారాల్లో తమ తప్పులేకుంటే.. తప్పుడు ప్రచారంపై ఎమ్మెల్యేలు గానీ, పార్టీ నేతలు గానీ వెంటనే బయటకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని స్పష్టంచేశారు.

**పథకాల అమల్లో భాగస్వాములు కావాలి**

సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రజాస్పందనపై పార్టీ వర్గాలతో చంద్రబాబు సమీక్షించారు. అన్నదాత సుఖీభవ పథకంపై అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన ర్యాలీలు, కార్యక్రమాల ఎంత వరకు విజయవంతం అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. స్త్రీశక్తి పేరుతో ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణంపై అన్ని ప్రాంతాల్లో అద్భుత స్పందన వస్తోందని పార్టీ నేతలు ఆయనకు చెప్పారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్‌తో వైసీపీ అంతర్మథనంలో పడిందని, దీంతో తప్పుడు ప్రచారాలకు దిగుతోందని తెలిపారు. ఉచిత బస్సు పథకంపై గందరగోళం సృష్టించేందుకు వైసీపీ, దాని అనుబంధ మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని వారిని సీఎం ఆదేశించారు. పథకాల అమల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు విధిగా భాగస్వాములయ్యేలా చూడాలని నిర్దేశించారు. ప్రజలతో మమేకమైతేనే పథకాల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వ్యాఖ్యానించారు.

## 5 జిల్లాలకు రెడ్ అలర్ట్



-మొదటిపేజీ తరువాయి

బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర పైకి భారీగా తేమగాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు యానాంకు విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. మంగళవారం ఉదయం వరకు ఆ జిల్లాలతోపాటు పలు జిల్లాల్లో కుంభవృష్టి, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం ఉత్తరాంధ్రలో అనేకచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. కోస్తాలో మిగిలిన ప్రాంతాలు, రాయలసీమలోనూ వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, యానాం, అంబేద్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలో అక్కడక్కడ కుంభవృష్టి, కోస్తాలోని మిగిలిన జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. ఇంకా రాయలసీమలోని తిరుపతిలో భారీగా, మిగిలిన జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా మారిందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నంలో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

**అధికారులూ అప్రమత్తం!**

అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. అత్యవసర సేవల కోసం జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాలని స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లో సంప్రదించాలని కోరారు.

## మాకు న్యాయం చేయండి

-మొదటిపేజీ తరువాయి



మంది రాశారు. మధ్యాహ్నం తెలుగుతో పాటు కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ మీడియంలకు కలిపి పరీక్ష జరిగింది. 15,608 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. కాగా, రెండు సెషన్లలో తెలుగు మీడియం అభ్యర్థులు పరీక్ష రాయడంతో అందరికీ కలిపి మార్కులు నార్మలైజేషన్ చేశారు. దీంతో మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు ఏకంగా ఐదారు మార్కులు పెరిగాయని చెబుతున్నారు. ఒకే మీడియం అభ్యర్థులకు కలిపి నార్మలైజేషన్ చేయాలని, ఇలా వేర్వేరు మీడియంలకు చెందిన పేపర్లను కలిపి చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, దీనిపై డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే నార్మలైజేషన్ చేశామని తెలిపారు. వేర్వేరు మీడియంలు అయినా కలిపి నార్మలైజేషన్ చేయవచ్చన్నారు. దీనిపై అభ్యర్థుల నుంచి వినతులు అందాయని, కానీ వారి వాదన సమంజసం కాదని తెలిపారు.

## శిశువులకు జన్మనిచ్చే రోబో

# చైనాలో పరిశోధకుల అద్భుత సృష్టి

**ప్రపంచంలో తొలి ప్రెగ్నెన్సీ రోబో ఇదే**

**వచ్చే ఏడాది చివరిలోగా ప్రొటోటైప్ రెడీ**

**న్యూఢిల్లీ :** చైనాలో పరిశోధకులు ప్రెగ్నెన్సీ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. గర్భాన్ని ధరించడంతోపాటు కృత్రిమ గర్భంలో నవమాసాలు శిశువును మోసి, సురక్షితంగా ప్రసవించడం ఈ రోబో ప్రత్యేకత. ప్రపంచంలో తొలి 'ప్రెగ్నెన్సీ రోబో' ఇదే. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఈ రోబోను అభివృద్ధి చేస్తున్నట్టు చైనా మీడియా వెల్లడించింది. నెలలు నిండకుండా జన్మించే శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంక్యుబేటర్ల కంటే ఈ రోబో చాలా భిన్నమైనది. గర్భాన్ని ధరించడం మొదలుకొని శిశువు జననం వరకు మొత్తం గర్భధారణ ప్రక్రియను ఈ రోబో అనుకరిస్తుంది. అంటే గర్భధారణ నుంచి ప్రసవం వరకు శిశువు పూర్తిగా హ్యూమనాయిడ్ రోబోలోని టెక్ గర్భంలో పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో కృత్రిమ గర్భ సాంకేతికత (ఆర్టిఫిషియల్ ఊంబ్ టెక్నాలజీ) ప్రధానమైనది. రోబో బొడ్డులో అమ్నియోటిక్ ద్రవంతో నింపిన కృత్రిమ గర్భం మానవ గర్భాన్ని అనుకరిస్తూ పిండం పెరుగుదలకు అనువైన పరిస్థితిని కల్పిస్తుంది. సహజంగా జన్మించే శిశువుకు జరాయువు (ప్లాసెంటా) ద్వారా పోషకాలు అందినట్టు ప్రెగ్నెన్సీ రోబోలో కృత్రిమ గర్భానికి జత చేసిన ట్యూబ్ ద్వారా శిశువుకు పోషకాలు అందుతాయి. కృత్రిమ గర్భ సాంకేతికత ఇప్పటికే పరిణితి చెందిన దశలో ఉన్నదని,



ఇప్పుడు దీన్ని రోబో ఉదరంలో అమర్చాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా నిజమైన వ్యక్తి ఆ రోబోతో ఇంటరాక్ట్ అయి గర్భధారణకు, ఆ గర్భంలో పిండం పెరుగుదలకు వీలు కల్పించాల్సి ఉన్నదని డాక్టర్ జాంగ్ వివరించారు. నిజానికి ఇదేమీ పూర్తిగా కొత్త భావన కాదని, గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ 'బయోబ్యాగ్'లో గొర్రెపిల్లను విజయవంతంగా పెంచారని, ఆర్టిఫిషియల్ ఊంబ్ ఆలోచనకు అప్పుడే బీజం పడిందని తెలిపారు. ప్రెగ్నెన్సీ రోబో ప్రొటోటైప్ (నమూనా) వచ్చే ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, అందుకు దాదాపు లక్ష యువాన్లు (రూ.12.96 లక్షలు) ఖర్చువుతుందని

## మరో 15 రోజులే ఉన్నాయి..

# మా తలుపులు తెరిచే ఉంటాయి

**న్యూఢిల్లీ:** బిహార్ ముసాయిదా ఎన్నికల జాబితాలో సవరణలకు మరో 15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. అన్ని పార్టీలకు సమానంగా ఈసీ తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పారు. బీహార్ ఎస్ఐఆర్ కింద ముసాయిదా ఎన్నికల జాబితాపై ఏ రాజకీయ పార్టీకి ఎలాంటి అనుమానులు ఉన్నా తమను సంప్రదించవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలకు సబంధించిన వివిధ అంశాలపై ఆదివారం మధ్యాహ్నం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో సిసీటీవీ ఫుటేజ్‌ను షేర్ చేయకపోవడానికి ఓటర్ల ప్రైవేసీని కాపాడాలన్నదే కారణమని సీఈసీ చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌ను ఎన్నికల కమిషన్ షేర్ చేయకపోవడంపై రాహుల్ గాంధీ సారథ్యంలోని పలు విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అవకతవకలు చోటుచేసుకోవడమే దానికి కారణమని తప్పుపట్టాయి. దీనిపీ సీఈసీ మాట్లాడుతూ, మెషీన్-రిడబుల్ ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి సుప్రీంకోర్టు 2019లో చాలా స్పష్టంగా చెప్పిందని, ఇందువల్ల ఓటర్ల ప్రైవసీకి భంగం కలుగుతుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొందని తెలిపారు. గత కొద్దిరోజులుగా పలువురు ఓటర్ల ఫోటోలు వాడుకుంటూ వాటిని మీడియాకు ఫార్వార్డ్ చేస్తుండటం చూస్తున్నామని, అలాంటప్పుడు మన తల్లులు, ఆడకూతుళ్ల ఫోటోలతో కూడిన సీసీటీవీ ఫుటేజ్‌ను కమిషన్ షేర్ చేయాలా? అని సీఈసీ




ప్రశ్నించారు.

**బెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌పై..**

పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఎప్పుడు నిర్వహించాలనేది ఎన్నికల సంఘం నిర్ణయిస్తుందని, తగిన సమయంలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని సీఈసీ తెలిపారు. ఎన్నికల ముందు ఎన్నికల జాబితాను సవరించడం ఎన్నికల కమిషన్ పని అని ఒక ప్రశ్నకు సమాధానంగా జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

### మోదీ చాలా ప్రమాదకారి..

### గద్దె దింపాలి



సాసారాం: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శుక్రవారంనాడు ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రశంసించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. ప్రధాన మంత్రి 'చాలా ప్రమాదకర వ్యక్తి' అని, ఆయనను అధికారం నుంచి తొలగించాలని అన్నారు. బీహార్‌లోని సాసారాంలో ఆదివారంనాడు జరిగిన విపక్ష ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, బీజేపీని అధికారం నుంచి తొలగించేంత వరకూ ప్రజల ఓట్లు, హక్కులు, స్వేచ్ఛకు, చివరకు రాజ్యాంగానికి కూడా భద్రత లేదని అన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, అలాంటి వ్యక్తులను ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి పొడగటం ఏమిటని ఖర్గే ప్రశ్నించారు. 'మీ వాళ్లెవరూ జైలుకు (స్వాతంత్ర్య పోరాటంలో) వెళ్లలేదు. ఉద్యోగాలు కావాలంటూ మీవాళ్లు బ్రిటిష్ వారికి దరఖాస్తులు చేసుకున్నారు. మేము వాళ్లతోనే ఉంటామని కూడా తెగేసి చెప్పారు. అలాంటి వ్యక్తుల పేర్లను ఎర్రకోట నుంచి ప్రధాని ప్రస్తావించడమంటే దేశ స్వాతంత్ర్య కోసం ప్రాణత్యాగాలు చేసిన వారి ఆత్మలకు మీరెలాంటి సమాధానమిస్తారు' అని ఖర్గే నిలదీసారు. ఆ కారణంగానే ఆయన (మోదీ) చాలా ప్రమాదకరమైన వ్యక్తని తాను చెప్పగలనని అన్నారు. ప్రధాని మోదీని గద్దె దింపేంత వరకూ, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తొలగించేంత వరకూ రాజ్యాంగానికి, ప్రజల హక్కులకు ముప్పు ఉంటుందని ఖర్గే అన్నారు. ప్రజల ఓట్లు, యువత ఉద్యోగాలు, రైతుల నుంచి ఎంఎస్‌పీని మోదీ దోచుకుంటున్నారని విమర్శించారు.

## భారత్‌కు మరో షాకిచ్చిన అమెరికా..

# ట్రంప్ ప్లాన్ అదేనా?


**ఢిల్లీ:** భారత్, అమెరికా మధ్య మాటల యుద్ధం కొనసాగు తున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాణిజ్య చర్చల కోసం భారత్‌కు రావాల్సిన అమెరికా బృందం ట్విస్ట్ ఇస్తూ.. తమ పర్యటనను రద్దు చేసుకుంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దీంతో, వారి తదుపరి పర్యటనపై సస్పెన్స్ నెలకొంది. వివరాల ప్రకారం.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అ?ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌ను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంతో భారత్‌పై అమెరికా భారీగా సుంకాల భారాన్ని మోపింది. ట్రంప్ ఇటీవల భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు. పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అదనపు 25% టారిఫ్‌లు ఈ నెల 27ను అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో సుంకాలు అమలులోకి రాకముందే.. అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపి మధ్యంతర ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో దీనికి సంబంధించి ఇప్పటికే ఇరు దేశాల ప్రతినిధుల మధ్య ఐదు దఫాలు చర్చలు జరిగాయి. ఆరో దఫా చర్చలకు అమెరికా ప్రతినిధులు ఈ నెల 25-29 మధ్య భారత్‌లో పర్యటించాల్సి ఉంది. ఈ దఫా చర్చల్లో భాగంగా.. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలకు సంబంధించిన చిక్కుముడులు వీడే అవకాశం ఉందని అందరూ భావించారు. అయితే, తాజాగా వారు ఆ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. చర్చలకు సంబంధించిన తదుపరి తేదీలను కూడా వారు



Image credit: x.com/POTUS

వెల్లడించలేదు. దీంతో, మరోసారి ఇరు దేశాల మధ్య చర్చలు ఉంటాయా? లేదా? అనే సందిగ్ధత నెలకొంది. ఒకవేళ చర్చలు విఫలమైతే.. భారత్‌పై టారీఫ్‌ల భారం పడే అవకాశం ఉంది. కాగా, భారత్‌పై సుంకాలు విధించాలనే ఆలోచనతోనే ట్రంప్ ఇలా ప్లాన్ చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, భారత్‌ను టార్గెట్ చేసి ట్రంప్ సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ దేశ ప్రజలకు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆయన మరోసారి అమెరికాలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ట్రంప్‌తో కూడా ఆయన భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య చర్చలు సఫలం అవుతాయా? అని అందరూ ఆసక్తికంగా ఎదురుచూస్తున్నారు.

### ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ :** వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్టు కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఆదివారం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఉంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తాము విపక్షాలతో కూడా సంప్రదిస్తున్నామని, ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించాలని వారిని కోరుతున్నామని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభల్లో 786 మంది సభ్యులుండగా, ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికి కనీసం 394 ఓట్లు అవసరం. అయితే ఎన్డీఏ కూటమికి రెండు సభల్లో కలిపి 422 ఓట్లు ఉన్నాయి. దీంతో ఆ అభ్యర్థి ఎన్నిక నల్లేరు మీద బండిగా భావిస్తున్నారు. కాగా, ఇంతకుముందు ఉప రాష్ట్రపతిగా పనిచేసిన జగదీప్ ధన్‌ఖడ్ కూడా ఆ పదవికిలోకి రాకముందు గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఆగస్టు 21 ఆఖరు తేదీ. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖ నేతలు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి దింపేందుకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నట్టు ఇండియా కూటమి తెలిపింది.

**'తమిళనాడు మోదీ'గా గుర్తింపు**


ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957, అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. తమిళనాడులో ప్రభావవంతమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన ఈ ఓబీసీ నేతకు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో సుమారు 40 ఏండ్ల అనుభవం ఉంది. తమిళనాడు మోదీగా ఆయనను పిలుస్తారు. 2003 నుంచి 2006 వరకు ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న ఆయన తమిళనాడులో రెండు సార్లు ఎంపీగా చేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 2024, జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 ఫిబ్రవరి 18 నుంచి 2024 జూలై 30 వరకు జార?ండ్ గవర్నర్‌గా, 2024 మార్చి నుంచి జూలై వరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా 2024 మార్చి నుంచి ఆగస్టు వరకు పనిచేశారు.

### ఎస్ఐఆర్ అసలు రంగును బయటపెడతాం



ఢిల్లీ: బీహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని మరోసారి స్పష్టం చేశారు ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. బీహార్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ద్వారా ఉన్న ఓటర్లను తొలగించి కొత్త వారిని చేర్చి అక్రమంగా గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, దేశం ఎక్కడ ఓట్ల చోరీ జరిగినా అడ్డుకుంటామని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బీజేపీ నేతలు ప్రెస్‌మీట్ పెడితే ఈసీ అఫిడవిట్ అడగలేదని, తాను ప్రెస్‌మీట్ పెడితే అఫిడవిట్ ఈసీ అడుగుతోందని విమర్శించారు. ఓటర్ల డేటాను అడిగినా ఈసీ ఇంతవరకూ ఇవ్వలేదని ధ్వజమెత్తారు రాహుల్. మీ ఓట్లను దొంగిలించి.. ఎన్నికల్లో గెలిచి దేశ సంపదను సంపన్నులకు అందిస్తున్నారని మండిపడ్డారు. బీహార్‌లో చేస్తున్న ఎస్ఐఆర్ అసలు రంగు బయటపెడతామని రాహుల్ హెచ్చరించారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం( ఆగస్టు 15వ తేదీ) మరోసారి విచారించిన సుప్రీంకోర్టు.. ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం(ఆగస్టు 14వ తేదీ) విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం? ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది.

### కశ్మీరులో మరో మేఘ విస్ఫోటం..



శ్రీనగర్ : ఈ నెల 14న కురిసిన కుంభవృష్టి నుంచి జమ్ముకశ్మీరులోని కిష్టార్ తేరుకోకముందే, శని-ఆదివారాల మధ్య రాత్రి కథువా జిల్లాలో మేఘ విస్ఫోటం(క్లౌడ్ బరస్ట్) సంభవించింది. దీంతో ఏడుగురు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. కథువా జిల్లా అభివృద్ధి కమిషనర్ రాజేశ్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు, పోలీసులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు. జోధ్ ఘాటీ గ్రామానికి ఇతర ప్రాంతాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. జంగ్లోటే ప్రాంతంలో కొండచరియ విరిగిపడటంతో ఇద్దరు మరణించారు. జోధ్ ఘాటీలో గాయపడిన ఐదుగురిని దవాఖానకు తరలించినట్లు అధికారులు చెప్పారు. కొండచరియలు విరిగిపడటంతో బగర్డ్, చాంగ్డా, దిల్వాన్-హుట్లి గ్రామాలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు కురియడంతో చెరువులు, కుంటలు నిండిపోయాయి, ఉఝ్ నది ప్రమాద స్థాయికి సమీపంలో ప్రవహిస్తున్నది. చెరువులు, కుంటలు, కాలువలకు దూరంగా ఉండాలని ప్రజలను అధికారులు కోరారు. కుంభవృష్టి వల్ల ప్రాణ నష్టం సంభవించడంపై జమ్ముకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలియజేశానని చెప్పారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.1 లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కిష్టార్‌లో ఈ నెల 14న కురిసిన కుంభవృష్టి వల్ల దాదాపు 60 మంది మరణించారు, అనేక మంది గల్లంతయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరి

అంక గణితం.. బీజ గణితం.. ఏ గణితంతో గుణితం చేసినా 8o8=16. ఎక్కడికి పోయి లెక్క కట్టినా 8o8=16 అవుతుంది. కానీ, మన రాష్ట్రం విషయానికి వస్తే అనుమానమే లేదు, 8o8=సున్నానే. ఏడాది కాలంగా తెలంగాణలో ఇదే లెక్క నడుస్తున్నది. 'సారు.. కారు.. పదహారు' ఉన్నప్పటి లెక్క వేరు.. ఇప్పుడు సాగుతున్న లెక్క మరో తీరు. 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు కలిసి రాష్ట్రానికి పట్టుకొచ్చిన నిధులు సున్నా. పెద్ద ప్రాజెక్టులకు, పెద్ద పెద్ద ప్రభుత్వరంగ సంస్థలకు తెచ్చిన కొత్త అనుమతులు సున్నా. నిధులు, ప్రాజెక్టుల సంగతి అటుంచితే కనీసం ప్రజా కాంక్షనైనా నెరవేర్చారా? అంటే అదీ సున్నానే. 2023 చరమాంకంలో కేసీఆర్ దిగిపోతూ.. దిగిపోతూ రూ.2,102 కోట్లు కేంద్రం నుంచి ప్రత్యేక సాయంగా తీసుకువచ్చి ఇప్పుడున్న పాలకుల చేతిలో పెట్టి వెళ్లిపోయారు. మళ్లీ కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిన సాయం ఏమైనా ఉన్నదా? అంటే మృగ్యం అనే చెప్పవచ్చు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ, ఢిల్లీ నుంచి హైదరాబాద్ అటుపోను.. ఇటు రానూ ప్రయాణాలే అర్ధ నూర్లు దాటింది. కానీ, అర్ధ రూపాయి అదనపు ఆదాయమైతే అందలేదు. అటు 8 మంది, ఇటు 8 మంది ఎంపీలున్నా.. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చే నిధులే తప్ప ప్రత్యేకంగా కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు దక్కింది గుండు సున్నా. భారీ ఆయిల్ రిఫైనరీ ఇండస్ట్రీ, సెమీ కండక్టర్ పరిశ్రమలు, యూరియా బస్తాలు ఏపీకి తరలిపోతున్నయి. 'హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం కేంద్ర మంత్రులను కలిసి నిధులు అడిగినం..' అని సీఎం ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి సీఎంవో నుంచి ఓ మీడియా నోట్ పంపటం.. దాన్ని పతాక శీర్షికన ప్రచురించడం మీడియాకు అలవాటే. కానీ, ఇప్పటివరకు మెట్రో రైల్వే కోసం కేసీఆర్ పట్టుకొచ్చిన నిధులు తప్ప కొత్తగా రూపాయి కూడా అందలేదు. కానీ, ఏ హంగూ ఆర్భాటం లేకుండా యూపీ ప్రభుత్వం రూ.5,811 కోట్లు తీసుకున్నది. యూపీలోని లక్నో మెట్రో ప్రాజెక్టు-1బీలో 11.16 కిలోమీటర్ల కోసం రూ.5,801 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. లక్నో మాత్రమే కాదు.. మహారాష్ట్రలోని పుణె ఫేజ్-2కు సంబంధించి 12.75 కిలోమీటర్లకు రూ.3,626 కోట్లు, థానే మెట్రో రైలుకు రూ.12,200 కోట్లు కేటాయిస్తూ జూన్‌లోనే నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటకలోని బెంగళూరులో ఇప్పటికే 75 కిలోమీటర్ల మెట్రోలైన్ ఉండగా.. మరో 145 కిలోమీటర్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మెట్రో ఫేజ్-3 కింద మరో 45 కిలోమీటర్లు లైన్ నిర్మాణానికి కేంద్రం రూ.15,600 కోట్లు మంజూరు చేసింది. మనకు అటు 8 మంది ఎంపీలు, ఇటు 8 ఎంపీలున్నరు. వీళ్లలో ఇద్దరు మంత్రులు. అయినా తెలంగాణ మెట్రోరైలు రెండో దశ (ఏ, బీ)కు సంబంధించి కేబినెట్ నిర్ణయం సున్నా. నిధుల సంగతి దేవుడెరుగు. రైతులు యూరియా బస్తాల కోసం అల్లాడుతున్నరు. కాలం అదను మీదికి వచ్చింది. పొద్దస్తమానం పడిగాలులు కాసినా బస్తెడు యూరియా అందుతలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన కొత్తలో ఏడాది సగటు 7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం ఉన్నది. కాళేశ్వరం, నెట్టెంపాడు, భీమా, కేఎల్ఐ ప్రాజెక్టులు అనుభవంలోకి వచ్చిన తర్వాత కోటి ఎకరాల మాగాణి సాగులోకి వచ్చింది. 27 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు వాడిండ్రు. ఇందులో ఒక్క యూరియా 13.45 లక్షల మెట్రిక్ టన్నులు. ఈ వినియోగం ఎక్కడి నుంచి ఎక్కడికి పోయింది? అయినా ఒక్కనాడైనా రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాశారా? రైతుకు ఇచ్చే ఎరువుల దుకాణం కాడ పోలీసు బందోబస్తు పెట్టిన ఆనవాళ్లున్నయా? కేసీఆర్ బ్రహ్మాండంగా రైతుకు ఎరువులు విత్తనం, రైతుబంధు అందించిండు. మరి ఈ రోజు ఎరువుల దుకాణం దగ్గర చెప్పుల లైన్లు ఎందుకు వచ్చినయి? బస్తా బస్తాకు పోలీసు బందోబస్తు ఎందుకు పెడుతున్నరు? వానకాలం సీజన్ మొత్తానికి 24.45 లక్షల టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో యూరియా 10.50 లక్షల టన్నులు అవసరం. మే నెలాఖరు నాటికి కనిష్ఠంగా 6 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మాసం మొదటి వారంలోగా 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రంలో స్టాక్ ఉండాలి. కానీ, ఆగస్టు మాసం మొదటివారం వరకు 3 లక్షల టన్నులు మాత్రమే కేంద్రం నుంచి స్టాక్ వచ్చిందట. కేసీఆర్ ఉన్న పదేండ్లు కొరత లేకుండా స్టాకు వచ్చుడెట్లా? ఇప్పుడు అటు 8, ఇటు 8 మంది ఎంపీలుండి కింద ఒకరి ప్రభుత్వం, మీద ఒకరి ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా అదను మీద రైతన్నకు పెద్ద సున్నా పెట్టుడెట్ల? రాష్ట్రంలో దాదాపు 9 నెలల నుంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డ్రామా నడిపిస్తున్నరు. అది సాధ్యం కాదు, రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని సుప్రీంకోర్టు తీర్పు ఉందని తెలిసి కూడా సాగదీస్తున్నరు. బీసీలను మభ్యపెడుతున్నరు. బీసీ రిజర్వేషన్ల మీద అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఈ సంక్షోభాన్ని దాటేదెలా?

రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు ఆపాలంటూ వరస బెదిరింపులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌ను లొంగదీసుకోవాలని చూస్తున్న తరుణంలో మన విదేశాంగ శాఖ తొలిసారి నేరుగా బదులీయటం కీలక పరిణామం. దీనికి రెండురోజుల ముందు స్థానిక తయారీ ఉత్పత్తుల్ని, సరుకుల్ని కొనుగోలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. అమెరికాలో గత కొన్ని దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన అస్తవ్యస్త విధానాల పర్యవసానంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభానికి ట్రంప్ అమలుచేసిన తప్పుడు నిర్ణయాలు తోడై ఆర్థికవ్యవస్థను ఊపిరాడకుండా చేస్తున్నాయి. వాటి నుంచి బయటపడటం కోసం ఆయన ప్రపంచ దేశాలపై ఆర్థిక దండయాత్ర మొదలుపెట్టారు. చైనాపై 145 శాతం సుంకాల మోత మోగించటంతో మొదలుపెట్టి తన సన్నిహిత దేశాలపై సైతం దాదాపు 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించి, అనంతరకాలంలో వెనక్కితగ్గారు. ఈ దశలో ఆయన మన జోలికి రాలేదు. మోదీతో 2016 నుంచీ ఉన్న సాన్నిహిత్యంతో ఆయన తాను చెప్పినట్టు వింటా రని ట్రంప్ భ్రమపడ్డారు. తీరా కథ అడ్డం తిరిగేసరికి ఆగ్రహోదగ్రుడవుతున్నారు. అందుకే కావొచ్చు... జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండొనేసియాలపై 15%-%20 శాతంమధ్య సుంకాలు విధించిన పెద్ద మనిషి మన దగ్గరకొచ్చేసరికి ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతోపాటు రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆపకపోతే మరిన్ని రెట్లు పెంచుతానని హెచ్చరించారు. స్వదేశంలో సంపన్నులకూ, పారిశ్రామికవేత్తలకూ లక్షల కోట్ల డాలర్ల పన్ను రాయితీలు ప్రకటించి, ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలు విధించటం ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవాలన్నది ఆయన పథకం. దీన్ని చూసీచూడనట్టు వూరుకుంటే ఈ బాణీయే కొనసాగిస్తారు. అమెరికా పాటించే ద్వంద్వ ప్రమాణాలు ఎవరికీ తెలియనివి కాదు. కానీ ట్రంప్ మరింత నిస్సిగ్గుగా వాటిని ఆచరిస్తున్నారు. ఒకపక్క తమ అణు పరిశ్రమలకు కావాల్సిన యురేనియం హెక్సాఫ్లోరైడ్ అయినా, విద్యుత్ వాహనాల తయారీలో అవసరమైన ప్లాటినం రకానికి చెందిన రసాయన మూలకం పలాడియం, ఎరువులు, రసాయనాలు వంటివి రష్యా నుంచి ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూ... మనం మాత్రం ముడి చమురు కొనకూడదని శాసిస్తున్నారు. అందుకే మోదీ స్వదేశీ ఉత్పత్తుల్నీ, సరుకులనూ కొనటం అత్యవసరమని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్తమాన



తరుణంలో స్వదేశీ నినాదం సరైనది. అయిదేళ్లక్రితమే మోదీ ఆత్మనిర్భర్ భారత్ గురించి మాట్లాడారు. కానీ ఎన్డీయే ప్రభుత్వం ఈ విషయంలో పెద్దగా చేసిందేం లేదు. అంతక్రితం ఉన్న యూపీఏ ప్రభుత్వం గురించి చెప్పనవసరం లేదు. గతంలో ప్రణాళికా సంఘం, ఇప్పుడు నీతి ఆయోగ్... అలాగే సాంకేతిక నిపుణుల మాట చెల్లుబాటవుతూ వచ్చింది. ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ ఈ విషయంలో ప్రభుత్వాన్ని గతంలో పలుమార్లు తీవ్రంగా తప్పుబట్టింది. కానీ మారిందేమీ లేదు. ట్రంప్ ఒక్కరే కాదు...బ్రిటన్, ఈయూలు సైతం తమ వినియోగవస్తువులపై, యంత్ర పరిక రాలపై సుంకాలు తగ్గించమంటున్నాయి. అందుకు తలొగ్గితే మన సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) దెబ్బతింటాయి. అమెరికా ఒత్తిళ్లకు లొంగితే మన సాగు రంగం, పాడి పరిశ్రమ రంగం ఇబ్బందుల్లో పడతాయి. ఆ రెండు రంగాలపైనా 70 కోట్లమంది ప్రజానీకం ఆధారపడతారు. ఇవిగాక జన్యుమార్పిడి చేసిన మొక్కజొన్న, సోయాబీన్స్ దిగుమతి చేసు కోవాలని అమెరికా కోరుకుంటోంది. ఇది ప్రమాదకరం. వాటి సంగతలావుంచి వర్తమాన అనిశ్చిత వాతావరణంలో మనమే కాదు...దేశాలన్నీ ఆత్మరక్షణ బాటపట్టాయి. తమ దేశానికొచ్చే విదేశీ సరుకుపై అధిక సుంకాలు విధించటం, విదేశాలకు ఎగుమతయ్యే తమ సరుకుకు తక్కువ సుంకాల కోసం ఒత్తిళ్లు తీసుకురావటం రివాజైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండ క్టర్‌లు, రక్షణ, సౌరశక్తి రంగాలకు పెద్దయెత్తున ప్రోత్సాహకాలు ఇవ్వాల్సివుంది. పెంచిన సుంకాల పరిధిలో ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు వగైరాలను ట్రంప్ మినహాయించారు. 'జాతీయ ప్రయోజనాల రీత్యా' ఈ నిర్ణయం తీసుకున్నారట. కానీ ఆ ఉత్పత్తుల ధరల్ని పెంచటం ద్వారా అదనపు రాబడికి వ్యూహరచన చేస్తే అమెరికా సృష్టించదల్చుకున్న సంక్షోభంనుంచి ఉపశమనం పొందవచ్చు. అయితే వాటికి మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇదంతా సాధ్యం. ఇప్పటికే స్వావలంబన దిశగా అడుగులేసివుంటే వేరుగా వుండేది. ఇప్పటికిప్పుడు తీసుకునే చర్యల నుంచి వెంటనే ఫలితాన్ని ఆశించలేం. ఈలోగా అమెరికా కోరుతున్నదేమిటో, మన తిరస్కరణకు కారణమేమిటో పార్లమెంటు వేదికగా తేటతెల్లం చేయాలి. అది జరిగితేనే ప్రజలు మరింత దృఢంగా మద్దతిస్తారు.

# ఇక జియో పొలిటికల్ షిఫ్ట్

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ ? చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది. భారత్ చైనా మధ్య స్నేహబంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్ కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్ ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ ? చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య



విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్ లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్ గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ? సాఆ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమేటిక్ గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్ లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది. ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్ ను అమెరికా దగ్గర తీస్తోంది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనాపై 20 శాతం సుంకాలు, భారత్ పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్ ? చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ ? చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫికేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడులపై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్ గా చెప్పాలంటే ట్రంప్ విధానాలు భారత్-చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.



## ఘనంగా ఏ పి యు డబ్ల్యూ జె 69వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### సీనియర్ జర్నలిస్ట్ లకు సత్కారం




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 69వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా తొలుత ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఎన్.వి ప్రసాద్ ఎగురవేశారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు పరసా సుబ్బారావు (సాక్షి), కొండేపూడి సత్య నారాయణ ( విశాలాంధ్ర), సుంకర ప్రసాద్ ( వార్త) లను యూనియన్ సభ్యులు, నాయకులు ఘనంగా సత్కరించారు. పాత్రికేయులు మరింత సమిష్టిగా పనిచేసి యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోనసీమ అధ్యక్షులు మండేల నాగ వెంకట ప్రసాద్ (బాబీ) పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే జిల్లా కోశాధికారి ఎం. వఫా అబ్బాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పితాని ఈశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కోశాధికారి పొట్టుపోతు నాగు, అమలాపురం నియోజకవర్గ అధ్యక్షుడు అరిగెల రుద్ర శ్రీనివాస్, అమలాపురం నియోజకవర్గ సెక్రటరీ దొమ్మేటి వెంకట్, కాకిలేటి సూరిబాబు, వరదా సూరిబాబు, ఆకుల రవితేజ, చొల్లంగి ప్రసాద్, కడలి సాయిబాబా, ఆసు భరత్ రామ్, కోరుమిల్లి రాము, ఎన్.పి.శర్మ, కానుబోయిన దుర్గాప్రసాద్, ఆకొండి చంద్రమౌళి, నీలకంఠం, కుప్పాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస** మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా అమలాపురం చిరంజీవి యువత ఆధ్వర్యంలో జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక మహిపాల వీధి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం నందు చిరంజీవి ( కొణిదల శివ శంకర్ వరప్రసాద్) ( జనుకుల గోత్రం) పేరుమీద ప్రత్యేకమైన పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమాన సంఘాల నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు, వర్రే శేషు, గొర్తి పవన్, నల్లా చిన్ని, పోలిశెట్టి రాము చాగంటి వరప్రసాద్, ఆచంట శ్రీను, వేమ నరసింహారావు, జనపరెడ్డి హరి, గరపాటి వీరభద్రరావు. తిక్కిరెడ్డి రాజా. ఇమని సాయి కృష్ణ శర్మ. సువర్ణ రత్నాకర్. తదితరులు పాల్గొన్నారు

## ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంచైర్మన్గా అల్లూరి



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామపంచాయతీ లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్గా అల్లూరి రామకృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అధికారులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తమ అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమం ఇంత దిగ్విజయంగా జరిపించిన గ్రామ ప్రజలకు ఎన్డిఏ కుటుంబ సభ్యులకు నాయకులకు అల్లూరి రామ కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రామచంద్రపురంలో ఘనంగా ఎపియుడబల్యూజే ఆవిర్భావ దినోత్సవం



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ :-** రామచంద్ర పురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ఎపియుడబల్యూజే ఆవిర్భావ దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎపియుడబల్యూజే రాష్ట్ర,జిల్లా కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు యూనియన్ ఆవిర్భావ దినోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఎపియుడబల్యూజే పతాకాన్ని (జెండా) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచారు.అనంతరం సీనియర్ జర్నలిస్ట్ బి.ప్రభాకర్ ఎపియుడబల్యూజే ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎపియుడబల్యూజే కార్యదర్శి కాటే భీమశంకరం మాట్లాడుతూ 1957 ఆగస్టు 17 న హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో వర్కింగ్ జర్నలిస్ట్ కార్మిక ఉద్యమ నేత మానికొండ చలపతి రావు చేతుల మీదుగా ఎపియుడబల్యూజే యూనియన్ ఆవిర్భావించిందన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకు జర్నలిస్టుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఏకైక జర్నలిస్ట్ యూనియన్ ఎపియుడబల్యూజే అన్నారు.దేశంలో 9,300 మంది సభ్యులు గల అతిపెద్ద యూనియన్ అని తెలిపారు.అలానే జిల్లా ఉపాధ్యక్షులు బోడపాటి ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టు లందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, అక్రిడేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కుడుపూడి రమేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు గంపల వృథ్వి రాజ్,పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు బి. సిద్ధు మరియు యూనియన్ సభ్యులు బాషా,శ్రీనివాస్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం ఎంపిక




**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహాసభ ఘనంగా జరిగింది.ఈ సభలో నూతన కార్యవర్గాన్ని నియమించారు.ఈ మహాసభకు మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వర రావు ప్రతినిధిగా హాజరయ్యారు. ముందుగా సంతాప తీర్మానం మున్సిపల్ వర్కర్స్ జిల్లా కన్వీనర్ జి. దుర్గాప్రసాద్ ప్రవేశ పెట్టినారు.అనంతరం జిల్లా విభజన అనంతరం జిల్లాలో జరిగిన పోరాటాలు,కార్య క్రమాలు ప్రవేశ పెట్టారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం,రామచంద్రపురం మండలం సీఐటీయూ కన్వీనర్ దుర్గమ్మ మహాసభ ను ఉద్దేశించి మాట్లాడారు.మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు జిల్లాలో మున్సిపల్ వర్కర్స్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రం లో మున్సిపల్ వర్కర్స్ ప్రజల ఆరోగ్యాలు,ప్రజల అవసరాలు తీర్చే కార్మికులకు అరకొర జీతాలు ఇస్తున్నారని, పర్మినెంట్ కార్మికులకు గత నాలుగు ఏళ్లుగా పెండింగ్లో ఉన్న డి ఏ బకాయి, సరెండర్ లీవులు, సమస్యల పరిష్కారం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 14 నెలలు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమస్య పరిష్కరించలేదని మండిపడ్డారు.279 జీవో ద్వారా కార్మికులను కంపెనీ కార్మికులుగా మార్చాలని గత ప్రభుత్వం ప్రయత్నం చేసింది.ఈ ప్రభుత్వం కూడ ప్రయత్నం చేస్తుందని అలా గనక చేస్తే మిగతా కార్మికులందరినీ కలుపుకొని పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అనంతరం జిల్లా మహాసభలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులు జి దుర్గాప్రసాద్, అధ్యక్షులుగా మొక్క వెల్లి శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శిగా కొమరపు నరేంద్ర కుమార్,కోశాధికారి ఎండపల్లి బాబూరావు, ఉపాధ్యక్షులు నిమ్మకాయల మహాలక్ష్మి, ఎన్ నరసింహమూర్తి, సహాయ కార్యదర్శి లు టి. గోపి,బంగారు కొండ, కమిటీ సభ్యులు మాదుగుల శ్రీనివాస్,పి కోటేశ్వరరావు,పి శివప్రసాద్,బొత్స భాను, పిల్లి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, కాకి రాంబాబు,రామరాజు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని,తద్వారా వారి కాళ్లపై వారు నిలబడ్డామనే ఆత్మవిశ్వాసం కలుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కు గృహ సంబంధ ఉత్పత్తుల తయారీ పై నాలుగు రోజులపాటు ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం రామచంద్రపురంలో వి ఎస్ ఎం కళాశాలలో మంత్రి ప్రారంభించారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంగా,ఏటా లక్ష 75 వేల మంది మహిళ పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దీపం పథకం,తల్లికి వందనం, స్త్రీ శక్తి – ఉచిత బస్సు పథకం విజయవంతంగా అమలు చేశామన్నారు. వృత్తి విద్య కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేసేందుకు పలు జాబ్ మేళాల నిర్వహణతో పాటు,మహిళలకు కుట్లు మిషన్లు శిక్షణ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ,జ్యూట్ బ్యాగ్ తయారు తదితర శిక్షణలు ఇచ్చి వారి స్వయం ఉపాధికి ఊత మిస్తున్నామ న్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఈల స్థాపనలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. చిన్నపాటి అప్పుల కోసం అవస్థలు పడుతూ, పలు రకాల ఇబ్బందుల కోసం పొదుపు చేసుకుంటూ... లోనే భర్తలను కోల్పోయి బతుకు భారంతో ఉన్న వితంతువులకు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా, ముద్ర రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం వివిధ రకాల సబ్బులు, షాంపూలు,లోషన్లు,టూత్ పేస్టులు,లిప్ బామ్ లు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరు నుంచి నిపుణులను తీసుకొచ్చా మన్నారు. ఈనెల 20 వరకు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. త్వరలోనే సెల్ ఫోన్ల రిపేర్, అగరబత్తీల తయారీ శిక్షణ నిర్వహిస్తామ న్నారు.ఈ శిక్షణలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు మంత్రి సుభాష్ సహకారంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. మహిళల పట్ల సామాజిక బాధ్యతగా పలు శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మంత్రి సుభాష్ కు,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలకు శిక్షణ ఇచ్చే నిపుణులు ప్రియా జైన్ బెంగళూరు ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు పుండవిల్లి శివ, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఆకలితో ఎవరు ఉండకూడదు

**అందుకే వివిధ ఫంక్షన్ లలో మిగిలిన ఆహారం సేకరిస్తున్నాం**
**ఆకలి అన్నవాళ్ళకు పంచుతున్నాం**
**భీమేశ్వరస్వామి సన్నిధిలో అమ్మ టీమ్ లోగో లాంచ్**



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** కె.గంగవరం మండలంలో గత పది సంవత్సరాలుగా అనేక సహాయక కార్యక్రమాలు చేస్తున్న అమ్మ టీమ్ సభ్యులు.ఈ అమ్మ టీమ్ సభ్యులు చుట్టుప్రక్కల పరిసరాల ప్రాంతంలో ఏ విధమైన ఫంక్షన్ కార్యక్రమాలు జరిగినా అందులో మిగిలిన ఆహారాన్ని సేకరించి ఆకలితో బాధపడుతున్న వారికి సలాది ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో అమ్మ టీమ్ సభ్యులు అందించి ఆకలి తీరుస్తున్నారు. అయితే టీమ్ సభ్యులు ఇంకా అనేక విధాలుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ద్రాక్షారామంలో శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి సన్నిధిలో అమ్మ టీమ్ లోగోను ప్రారంభించారు.లోగో ఆవిష్కరణకు బిజెపి పార్టీ యువ మోర్చా మండల అధ్యక్షుడు పి.శ్రీరామ్ మణికంఠ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అమ్మ టీం ద్వారా మరిన్ని సేవలు చేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అలానే ఎవరు కూడా ఆకలితో ఉండకూడదని,వాళ్లకు ఆహారం అందించడంలో సలాది ప్రసన్నకుమార్ చేస్తున్న సేవలను అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయ పునః ప్రతిష్ట శంఖుస్థాపన...

### పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు...




**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మండపేట పట్టణంలో సూర్యారావుపేట 12వ వార్డు లో ఆదివారం ఉదయం శ్రీ బసవేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్, మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మరియు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ యంగ్ర ప్రభాకరరావు, శిరంగి శ్రీనివాస్, ఉమ్మూజారి శ్రీను, టిడిపి పట్టణ అధ్యక్షులు మర్రా నాగు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నున్న వారి వివాహ వేడుకలో పాల్గొన్న బత్తుల




**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం, మిర్తిపాడు గ్రామంలో జరిగిన నున్న వారి వివాహ వేడుకకు ప్రత్యేక ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి హాజరయ్యారు. ఈ తరుణంలో నూతన వధూవరులు రమేష్ %ఁ% పావని లను వెంకటలక్ష్మి తమ స్వహస్తాలతో నిండు మనసుతో అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్ దంపతులను పరామర్శించిన పెందుర్తి



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలోని పశ్చిమ గోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక తండ్రి ఆదిరెడ్డి శంకర అప్పారావు ఇటీవల స్వర్గస్తులైనారు. ఆదివారం దేవిక స్వగ్రామం వీరవాసరంలో రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టూరు ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్ రొంగల దేవిక శ్రీనివాస్ దంపతులను పరామర్శించి, మృతుడు శంకర అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సూరపనేని వారి వివాహ వేడుకలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గం, సీతానగరం మండలం, సీతానగరం గ్రామంలో జీవీకే కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగిన సూరపనేని వారి వివాహ వేడుకకు ప్రత్యేక ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి హాజరయ్యారు. ఈ తరుణంలో నూతన వధూవరులు కేశవ, నిహారిక లను వెంకటలక్ష్మి తమ స్వహస్తాలతో నిండు మనసుతో అక్షింతలు వేసి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో జనసేన ,టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేసిన సేవాదళం సభ్యులు.







**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని సేవాదళం సభ్యులు అల్లవరం మండలం లోనీ వివిధ హై స్కూల్స్ లో నిర్వహించిన మెగా క్విజ్ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం శుక్రవారం జరిగింది. ఈ మెగా క్విజ్ లో గోడిలంక హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు మొదటి స్థానం సాధించగా, సామంతకుర్రు హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు రెండవ స్థానం, అలాగే కొమరగిరిపట్నం హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు మూడవ స్థానం కైవసం చేసుకున్నారు. ఇందుకు గాను మొదటి బహుమతిగా పదివేల రూపాయలు (10000), రెండవ బహుమతి గా ఆరు వేల రూపాయలు(6000), మూడవ బహుమతిగా (4000) నాలుగువేల రూపాయలు నగదు రూపంలో ఇవ్వడం జరిగింది.అలాగే వాటితో పాటు సర్టిఫికెట్ , మెడల్స్ మరియు ప్రతీ స్కూల్ కి సేవాదళం తరపున షీల్డ్ ఇవ్వడం జరిగింది. ఈ మెగా క్విజ్ నిమిత్తం ఖర్చుకు చింతా మహానాగరాజు (చిలకలపూడి ధర్మ) పదిహేను వేల రూపాయలు, మందపాటి వెంకన్నబాబు మూడు వేల రూపాయలు, మల్లాడి అర్జునరావు ఐదు వేల రూపాయలు, మధుర చాణక్య 5 వేల రూపాయలు,సోమాని వెంకటరమణ వెయ్యి రూపాయలు,పొలమూరి సురేష్ కుమార్ 3 వేల రూపాయలు,మల్లాడి నాగార్జున కుమార్ ( రాము) రెండు వేల ఐదు వందల రూపాయలు,దొండపాటి సత్యనారాయణ 3 వేల రూపాయలు,పరమట ఆది సత్యనారాయణ 15 వందల రూపాయలు,లక్ష్మీ వెంకటేశ్వర మెడికల్ షాప్ స్క్రీనింగ్ టెస్ట్ పేపర్స్ కు అయ్యిన ఖర్చు కు బాధ్యత వహించడం జరిగింది.అలాగే ఓడలరేవు గ్రామస్థులు పెమ్మాడి రమేష్ హైదరాబాద్ లో స్థిరపడి ఓడలరేవు గ్రామానికి ఏదో ఒకటి చెయ్యాలనే దృక్పథంతో ముందుకు వచ్చి ఓడలరేవు హైస్కూల్ కి స్పోర్ట్స్ కి సంబంధించిన వస్తువులను (స్పోర్ట్స్ కిట్) 14000/- రూపాయలు వెచ్చించి సేవాదళం ఆధ్వర్యంలో కిట్లు ను ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా రమేష్ కి, అలాగే ఈ సేవా కార్యక్రమాలకు కు సహకరించిన సోదరులకు, వివిధ స్కూల్ ఉపాధ్యాయులకు, తల్లి తండ్రులకు సేవాదళం తరపున హృదయ పూర్వక సేవాభినందనలు తెలియజేసారు. సేవాదళం సభ్యులు మాట్లా డుతూ ఈ విధముగా దాతలు ముందుకు వస్తే ఇలాంటి మంచి కార్యక్రమాలు తో మున్ముందు మరెన్నో సేవాకార్యక్రమాలతో ఎల్లప్పుడూ పేద ప్రజలకు అందుబాటు లో ఉంటూ, మట్టిలో మాణిక్యాల ను వెలుగులోకి తీసుకొచ్చి సమాజ సేవ లో ముందు ఉంటామని తెలిపారు.

# రోడ్డు పునర్నిర్మించే వరకు ఉద్యమిస్తాం
# స్పష్టం చేసిన గిరిజన గ్రామాల యువత







**రమణయ్యపేట–జె.అన్నవరం రోడ్డు కోసం యువకుల ర్యాలీ, ధర్నా, రాస్తారోకో.**

**యువకుల ఉద్యమానికి ఐదు గిరిజన గ్రామాల మద్దతు.**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండల పరిధిలోని రమణయ్యపేట – జడ్డంగి అన్నవరం వరకు సుమారు 12 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి నిర్మించి 20 సంవత్సరాలపై మాటే అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారం చేపడుతున్న రాజకీయ పార్టీలు మాత్రమే మారుతున్నాయి. ఐనప్పటికీ రోడ్డు దుస్థితి ఏం మారలేదు. పెద్ద పెద్ద గోతులతో కనీసం పాదచారులు కూడా నడవ వీలులేని విధంగా చిద్రమైంది. ఎన్నికల వేళ ప్రతినాయకుడూ ఈ ఆర్ అండ్ బి రోడ్డు పునర్నిస్తామని హామీలు ఇవ్వడం, లేనిపక్షంలో తామే స్వయంగా ధర్నా చేస్తామని చెప్పడం పరిపాటే. ఎన్నికలు అయిన తర్వాత గద్దె నెక్కిన తర్వాత నిధులు లేమి సాకుతో రోడ్డు పునర్నిర్మాణానికీ ఎమ్మెల్యేలు వెనుకడుగేయడం సర్వ సాధారణం అయిపోయింది. ఏలేశ్వరం నుండి సుమారు 300 గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారి రమణయ్యపేట, గొటువానిపాలెం, జె అన్నవరం మీదుగా అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల గిరిజన గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. ఇది 20 సంవత్సరాలుగా పునర్నిర్మాణానికి నోచుకోలేదు. అల్లూరి సీతారామ రాజు, కాకినాడ రెండు జిల్లాలను కలపుతున్న ఈ ప్రధాన రహదారి ఏలేశ్వరం – నర్సీపట్నం ఈ ఆర్ అండ్ బి రహదారిగా ప్రసిద్ధి చెందింది. ఏలేశ్వరం మీదుగా మైదాన ప్రాంతాలకు గిరిజనులు చేరుకోవాలన్నా, మైదాన వాసులు వివిధ గిరిజన మండలాల గ్రామాలను చేరు కోవడానికి ఇదే దగ్గర దారి. అయినప్పటికీ అధికారులు, పాలకులు కూడా పట్టించుకోలేదు. దీంతో 20 సంవత్సరాలుగా ఈ రోడ్డు ఏ అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు మొత్తం పొడవునా పెద్ద పెద్ద గోతుల మయంగా మారిపోయింది. వర్షం వస్తే ఏది గొయ్యో ఏది గొయ్యి కాదో తెలియని చెరువులా కనిపిస్తుంది. ఈ దుస్థితిలో ఉన్న రహదారిపై తప్పని పరిస్థితుల్ల ప్రయాణం చేసిన వాహనచోదకులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. నిండు గర్భిణీలు వైద్యం, కాన్పుల కోసం ఏలేశ్వరంలోని వివిధ ఆస్పత్రులకు వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు ఏలేశ్వరంలోనే గిరిజన పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఈ గోతుల రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాలను భరించలే మధ్యలోనే చదువులను మానుకుంటున్నారు. గోతుల్లో పడి అనేక వాహనాలు దెబ్బతింటున్నాయని, అదే మాదిరిగా ఆర్టీసీ బస్సులకు కూడా తీవ్ర నష్టం వస్తోందని అధికారులే గతంలో ప్రకటించారు. ఈ రహదారిపై ప్రయాణం వల్ల తరచూ మా వాహనాలు ప్రమాదాలకు గురవడంతో పాటు వాహనాలు మరమ్మతులకి వస్తున్నాయని, ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని ఆటో, 4 చక్రాల వాహన చోదకులు బాధపడు తున్నారు. ద్విచక్ర వాహన చోదకులైతే ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. రమణయ్యపేట నుండి జే అన్నవరం వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కొబ్బరికాయ కొట్టి ఆర్ అండ్ బి అధికారులను వారం రోజుల్లో రోడ్డు పనులు మొదలెట్టమని ఆదేశించారు. కానీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి సుమారు 14 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు రోడ్డు పునర్నిర్మాణం జరగలేదు. దీంతో రమణయ్యపేట, జే అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, కిమ్మూరు, గుంటువానిపాలెం గ్రామాలకు చెందిన గిరిజన యువకులు ఉద్యమిస్తే గాని పాలకులు దిగిరారని శనివారం ఉద్యమ బాట పట్టారు. తూర్పు లక్ష్మీపురం నుంచి ర్యాలీగా వచ్చి రమణయ్యపేట ఫారెస్ట్ ఠానా వద్ద ధర్నా చేపట్టారు. సుమారు ఐదు గంటలపాటు గిరిజనులు రాస్తారోకో నిర్వహించారు. చివరకు ఏలేశ్వరం పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసనకారులను సంప్రదించారు. శాంతియుతంగా నిరసన తెలుపు కోవాలి తప్ప రాస్తారోకో చేయరాదని హితవు పలికారు. రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే, ఆర్ అండ్ బి అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నిరసనకారులు హెచ్చరించారు.

## పిఠాపురం ఆడపడుచులకు ఉపముఖ్యమంత్రి కానుక

**22 న పాదగయలో చీరల బహుమతుల పంపిణీ**



**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రావణ శుక్రవారం సందర్భంగా పిఠాపురం ఆడపడుచులకు 22 వ తేదీన పాదగయ పుణ్యక్షేత్రం వద్ద చీరలను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ గ్రామీణ నియోజకవర్గం ఎమ్మెల్యే పంతం నానాజీ సంయుక్తంగా ప్రకటించారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఈ ఉచిత చీరలను పిఠాపురం ఆడపడుచులకు పంపిణీ చేస్తామని వారు ప్రటించారు. తన నియోజకవర్గం కేంద్రం పిఠాపురంలోని ఆడపడుచులకు వరలక్ష్మీ వ్రతం కానుకగా స్థానిక శాసన సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్వచ్ఛందంగా పంపిణీచేయ పెట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉద్దేశించిన సమీక్షా సమావేశాన్ని పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రం ఆలయ ఈవో కట్నం జగన్మోహన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్థానిక మీడియా సమావేశంలో నేతల ద్వయం ఈ బహుమతి చీరల పంపిణీ కానుక ప్రకటన చేసారు. పిఠాపురంలో ఉన్న మహిళలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మహిళలకు చీరలను బహుకరించడానికి ప్రత్యేకంగా ఐదు బ్యాచులను ఏర్పాటు చేసామని, ఉదయం 5 గంటల నుండి ఈ బహుమతి చీరల పంపిణీని చేపడతామని, ఈ సదవకాశాన్ని పవన్ కళ్యాణ్ పిఠాపురం సోదరీమణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని నాయకద్వయం ప్రకటించారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ గ్రామీణ నియోజకవర్గం ఎమ్మెల్యే పంతం నానాజీ తోపాటు పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్ కావేరి బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**కరప క్రైమ్:విశ్వం వాయిస్ న్యూస్** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పూజారి పాలెం గ్రామానికి చెందిన పోనుగుపాటి రమేష్ వయసు 31 సంవత్సరాలు ఇద్దరు అబ్బాయిలు సంతానం. రమేష్ రావులపాలెంలో స్వీట్ షాప్ లో పనిచేస్తు అతని చిన్నబ్బాయి వివేక్ వర్ధన్ కు టెస్టికల్ సర్జరీ చేయించుటకు కాకినాడ జిజి హెచ్ లో జాయిన్ చేసి, ఆ పిల్లవాడికి హాస్పిటల్లో ఉండడానికి బట్టలు తీసుకురావడానికి అని రమేష్ తన పల్సర్ మోటార్ సైకిల్ పై కాకినాడ నుండి బయలుదేరి పూజారిపాలెం వెళుతుండగా ఉదయం సుమారు 10.30 గంటలకు వలసపాకల గ్రామ శివారుకు వచ్చేసరికి రామచంద్రపురం వైపు నుండి కాకినాడ వైపు వస్తున్న ప్రవేట్ కావేరీ బస్సు డ్రైవర్ స్పీడ్ గా అజాగ్రత్తగా హారన్ కొట్టకుండా వచ్చి రమేష్ మోటార్ సైకిల్ ను డీ కొట్టగా రమేష్ కుడి భుజం వద్ద బలమైన రక్తపు గాయమై అక్కడ అక్కడే మృతి చెందడని సదర విషయంపై అతని తమ్ముడు నటరాజు గ్రామస్తులు ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి కరప ఎస్సై టి సునీత దర్యాప్తు చేస్తున్నారు

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్.** జనసేన సీనియర్ నాయకులు, పార్టీ కోసం ఎంతో కష్టపడే మనిషి ఇటీవల అనారోగ్య కారణాలతో ఆపరేషన్ చేయించుకున్న కాకినాడ రూరల్ మండల జనసేన నాయకులు అద్దంకి వీరబాబును తూరంగిలో వారి ఇంటికి వెళ్ళి పరామర్శించిన కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ. ఎమ్మెల్యే పంతం నానాజీ మా ఇంటికి వచ్చి ఆపరేషన్ చేయించుకున్న నన్ను పరామర్శించడం ఆయన అభిమానిగా చాలా సంతోషంగా ఉంది అని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**కమిషనర్ భావన**



**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ భావన ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కమిషనర్ భావన ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న రెండు రోజుల పాటు కాకినాడ లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలా ఏళ్ళు క్రితం నిర్మించి శిథిలవస్థకు సిద్ధంగా ఉన్న భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా కాకినాడ కార్పొరేషన్ లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. వర్షాల వలన ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్లు తెగినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఇబ్బంది కలిగినా టోల్ ఫ్రీ నెంబర్, టోల్ ఫ్రీ నెంబర్ 18004255990 కంట్రోల్ రూమ్ లో ఉన్న సిబ్బంది ఫోన్ చేసి వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు.

**భారీ వర్షాలు కారణంగా పిజిఆర్ఎస్ రద్దు...**

వచ్చే రెండు రోజులు కాకినాడలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18 వ తేదీ సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను రద్దు చేయడం జరిగిందని కార్పొరేషన్ కమిషనర్ భావన ఒక ప్రకటనలో తెలిపారు

## జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

**పిజిఆర్ఎస్ నేడు రద్దు**


**జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలి**





**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం .పశ్చిమ వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున వచ్చే 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం.వచ్చే రెండు రోజులు కాకినాడ జిల్లా లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి సూచించారు.సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరిక జారీచేశారు. ప్రజలందరూ తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సూచించారు జిల్లాలో భారీ వర్షాలు వచ్చే రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18 వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను రద్దు చేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు .ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు .

## సోమవారం కాకినాడ పోలీసు పిజిఆర్ఎస్ రద్దు





**శంఖవరం, విశ్వం వాయిస్ :** ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున వచ్చే 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశంఉంది. వచ్చే రెండు రోజులు కాకినాడ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందు మాధవ్ సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు వచ్చే రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18 వ తేదీ సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ను రద్దు చేసామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ జి.బిందు మాధవ్ ఆదివారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు.





## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థ గత పటిష్టతకు కృషి చేయాలి

**డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసిన గుత్తుల మురళీధర్,దాసి వెంకటరావు**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మాజీ ముఖ్య మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన సంస్థాగత నాయకులు, కార్యకర్తలంతా పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగనన్న సారధ్యంలో పార్టీ మళ్లీ అధికారంలోకి రానుందని, జగనన్న సీఎం కానున్నారని ప్రజలంతా జగనన్నను కోరుకుంటున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలని ప్రజలు గుర్తించారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన సీనియర్ నాయకులు దాసి వెంకట్రావు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నియోజకవర్గ సిటీ ఉపాధ్యక్షులుగా నియమితులైన గుత్తుల మురళీధర్ పదవులు అలంకరించిన తర్వాత తొలిసారిగా రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దాసి వెంకట్రావు,గుత్తులు మురళీధర్ లను శాలువాతో పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

## బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు.


**- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన.**



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఆదివారంతో ముగిసాయి. ఆదివారం కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా సిస్టర్ పార్వతి, వరలక్ష్మి మాట్లాడుతూ సర్వాంతర్యామి, జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్ముని లీలలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చించాలని, స్వామి లీలలు ఆలపించిన,విన్న ముక్తికి మార్గాలవుతాయన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామల వేషధారణలో వివిధ ఆధ్యాత్మిక గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాజు అన్నయ్య, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ బిల్డప్ తో "కారు"

**-వాహన యజమాని వాసు**




**దవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక లక్ష్మి నరసింహనగర్లో ఉంటున్న ఒక రియల్టర్ ఈయన కారు మాత్రం పోలీస్ వాహనం లాగా రోడ్ల మీద చక్కర్లు కొడుతుంది.అద్దం పైన పోలీస్ అని బోర్డు డాష్ బోర్డ్ పైన పోలీస్ క్యాప్ ఇక సైరన్ మర్చిపోయినట్టున్నారు.ఈ బిల్డప్ చూసి ఈయన ఒక పోలీస్ ఆఫీసర్ అనుకునే లా ఉంటుంది. హ్యుండాయ్ ఆల్కయజార్ ఏపి40సీ 2335 నెంబర్ గల ఈ వాహనం ఒక మాములు వ్యక్తి ది అయినప్పటికీ మరి పోలీసు ముసుగు ఎందుకు వేసినట్టు ఆలా ప్రయాణించడం నేరము కదా? విషయం ఆరా తీస్తే అతని పేరు వాసు గా తెలియవచ్చింది. ఆయన ఇంటి పక్కనే ఒక ఎస్. ఐ. అద్దెకు ఉండే వారని తదుపరి ఆయన బదిలీ పై వేరే చోటికీ వెళ్లిపోయారట. అప్పటినుండి ఆ బోర్డ్, ఆ పోలీస్ క్యాప్ తో ఈయన రోడ్ల పై ప్రయాణిస్తునట్లు సమాచారం.మరి ఇది పోలీసుల కంట పడలేదా? దీనీ పై ఏ విధంగా పోలీసులు స్పందిస్తారో చూద్దాం..

# ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత కరువు

**కనీస మౌలిక సదుపాయాలు లేవు.. ఉపాధికి తప్పని వెతలు**
**సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఎ బేబీ ఎదుట కన్నీటి పర్యంతం అయిన పోలవరం నిర్వాసితులు**
**దేవీపట్నం మండలం తాళ్లూరు, నాగులాపల్లి, మంటూరు కాలనీల్లో పర్యటించిన ఎం.ఎ బేబీ.. ఇదెక్కడి పునరావాసం**
**నిర్వాసితుల పునరావాసం విషయంలో కనీస మానవత్వం పాటించలేదు.. ఇళ్లు అనడానికి కూడా వీలు లేని పద్ధతుల్లో కాలనీలు నిర్మించారు**
**- సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఎ బేబీ**





**దేవీపట్నం,విశ్వం వాయిస్ న్యూస్:** మా కాలనీలో కనీస మాలిక సదుపాయాలు లేదు, మరుగు దొడ్లు తక్కువ ఎత్తులో నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షాలకి నీరు నిలిచిపోవడంతో ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. మహిళలు బహిర్భూమికి బహిరంగ ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుంది.ఇంటి నిర్మాణాలలో నాణ్యత లేదు.కాంట్రాక్టర్ సంప్రదిస్తే తనకు సంబంధం లేదని, తన కాలపరిమితి పూర్తయిందని,దిక్కున చోట చెప్పుకోమనిబెదిరిస్తున్నారు.అధికారులను సంప్రదిస్తే కనీస స్పందన లేదు. స్లాబులు కారిపోతున్నాయి. ఇళ్లలో ఎలా కాపురం చేయాలి అంటూ దేవీపట్నం మండలం తాళ్లూరు కాలనీకి చెందిన చదల పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు.

### అర్హత ఉన్న పునరావాసం కల్పించలేదు

అర్హత ఉన్న తనకు పునరావాసం కల్పించలేదని వృద్ధురాలైన తోకల సోమాలమ్మ సిపిఎం బృందం ఎదుట కన్నీటి పర్యంతం అవుతూ తన గోడు చెప్పుకుంది . గతంలో కొండ మొదలు పంచాయతీలో నివసించేదాన్ని అని అక్కడినుంచి బలవంతంగా తరలించారని వాపోయింది. ప్రస్తుతం తనకు పింఛను కూడా రావటం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోయిందని వివరించింది, ఇదే సమస్యతో సాధన పాపయమ్మ తన ఆవేదనను వ్యక్తం చేసింది.

### ఇంటి నిర్మాణం సగంలో ఆగిపోయింది

ప్రభుత్వం ఎటువంటి సాయం చేయకపోవడంతో ఇంటి నిర్మాణం సగంలో ఆగిపోయింది అంటూ నాగులపల్లి కాలనీ చెందిన చదల శ్రీనివాసరెడ్డి వాపోయారు. ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి పునరావాసం కల్పించలేదని, దీంతో ఆ నగదు తోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి నగదు సరిపోక సగం లోనే నిర్మాణం నిలిపివేశానని వాపోయారు. తన కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారని, ఏ ఒక్కరికి పూర్తిస్థాయిలో కూడా పునరావాసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించలేదని తెలిపారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడంతో తన ప్రయత్నం విరమించుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఏ ఒక్క ఇంటికి ప్లాస్టింగ్ చేయలేదు

నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని అయితే ఏ ఒక్క ఇంటి గోడకు ప్లాస్టింగ్ చేయలేదని కుంజం వెంకటలక్ష్మి తెలిపింది. రేషన్ బియ్యం కోసం 10 కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుందని తెలిపింది. తాగునీటి సౌకర్యం లేకపోవడం తో ద్విచక్ర వాహనంపై సమీపంలోని గోకవరం మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకుంటున్నామని ప్రయాణ ఖర్చులతో కలిపి ఒక బాటిల్ ఖరీదు ?50 పడుతుందని వాపోయింది. ఈ కాలనీలో అత్యధిక మంది ఉపాధికి దూరమయ్యారని, అధికార యంత్రాంగం కనీసం గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సైతం కల్పించడం లేదని తెలిపింది. ఇలా ఏ ఇంటి తలుపు తట్టిన పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను ఏ కరువు పెట్టారు. సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాదం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, లోతా రామారావు,వాణిశ్రీ, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి. అరుణ్ స్థానిక సిపిఎం నాయకులతో కలిసి శనివారం పోలవరం నిర్వాసిత కాలనీలైన తాళ్లూరు, నాగులపల్లి లలో పర్యటించారు.తాళ్లూరు కాలనీలో 240 కుటుంబాలకు,నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఈ కాలనీలలో ఇంటింటికి సిపిఎం బృందం వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంది. సిపిఎం నాయకులకు సాదర స్వాగతం లభించింది.పూల జల్లులతో, హారతులతో సాంప్రదాయంగా ఆహ్వానించారు. తమ సమస్యలను విన్నవించటం తో పాటు వినతి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎం ఏ బేబీ మాట్లాడుతూ ఇదెక్కడి పునరావాసం అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితుల పునరావాసం విషయంలో కనీస మానవత్వం పాటించలేదు అని మండిపడ్డారు. ఇళ్లు అనడానికి కూడా వీలు లేని పద్ధతుల్లో కాలనీలు నిర్మించారు అని విమర్శించారు.

# అభివృద్దే లేని రాష్ట్రంకు జిల్లాల విభజన ఎవరి కోసం..ఎందుకోసం

**- అవినీతి పాలకులతో అమాయక ఆంధ్రులు విల విల..**
**- మేడా శ్రీనివాస్, ఆందోళన ,**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** నేటి పాలకులుతో ఆంధ్రప్రదేశ్ కు రాజధాని సాధ్యమేనా..!అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి)ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ అడ్డగోలుగా ఢిల్లీ రాజకీయాల అవసరార్థం ఆంధ్రప్రదేశ్ ను ఆశాస్త్రీయంగా విభజించి రాష్ట్రానికి పెద్ద గాయం చేసారని , విభజిత ఆంధ్రప్రదేశ్ కు విభజన చట్ట ప్రకారం అప్పగించాల్సిన ఏ ఒక్కటి ఇవ్వక పోగా చట్ట పరమైన హక్కులను నేటికి మోదీ సర్కార్ అమలు చేయకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని అడు గడుగునా వంచిస్తున్నారు . ఆంధ్రప్రదేశ్లో గల నేటి పాలకులు హక్కుగా సాధించుకోవాల్సిన వాటి కోసం పట్టు పట్టకుండా దేహి అంటు అప్పుల కోసం వేంపర్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కార్పొరేట్ మీడియా కబోదిగా మిగిలింది.పాలన లేదు. మోదీ సర్కార్ ను ప్రశ్నించే దమ్ము లేదు.నా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఏమిటి అనే ఆలోచన లేదు.వేదనకు గురవుతున్న ప్రజల కోసం పాలకులకు భాధ్యత లేదు . నేటి ప్రధాన వ్యాపార రాజకీయ పార్టి లను బొందపెట్టి కొత్త తరం నేతలు చట్ట సభల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం వుంది . ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం నుండి రావాల్సిన చట్టబద్ధమైన హామీలను గల్లా పట్టుకుని సాధించుకు రావటానికి ఆంధ్రప్రదేశ్ నుండి దమ్మున్న నేతలను ఎన్నుకుందాం.త్వరపడండి ఆంధ్రులారా ! మన భవిష్యత్ కు మనమే పునాదులుగా నిలుద్దాం అంటు ఆయన పిలుపు నిచ్చారు .. విభజన అనంతరం ఏ ఒక్క అభివృద్ధికి నోచుకోని విభజిత ఆంధ్రప్రదేశ్ కు జిల్లాల విభజన ఇప్పుడు ఎవరి కోసం . ఎందు కోసం . ఆంధ్ర రాష్ట్రంలో ఉపాధి లేదు,ఉద్యోగ అవకాశాలు లేవు,ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి లను,హీనస్థితి గతులను అంచనాలు వేస్తున్న మేధావుల కుటుంబాల నుండి సంబంధాలు అందుకోవటానికి సైతం ససే మీరా అంటున్నారు . ఆంధ్రప్రదేశ్లో మెరుగైన విద్య లేదు. వైద్యం లేదు.కనీస వసతులు,కనీస మౌలిక సదుపాయాలు అస్సులు లేవు.మన పాలకులు ఎందుకు ఉన్నట్టొ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అర్ధం కావటం లేదు.ఆంధ్రప్రదేశ్ నుండి చట్ట సభల్లో ప్రాతినిత్యం వహిస్తున్న నేతలు చప్పట్లు కొట్టడానికి,వెకిలి నవ్వులు నవ్వుకోవటానికి మాత్రమే రాజకీయ హోదాలను అభవిస్తున్నారు.నేతలు ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గాల సమస్యలపై ఏఒక్కనేత అయినా చర్చించిన , ప్రశ్నించిన దాఖలాలు నేటికి ఉన్నాయా !యావత్ ఆంధ్రప్రదేశ్ లో గల నేతలు ప్రోటోకాల్ ముసుగులో భద్రత నీడలో బ్రతకటం తప్ప ప్రజలు మనస్సు గెలిచే దమ్ము ఏ ఒక్క నేతకు లేదనేది పచ్చి నిజం కాదా!ఆడబిడ్డలకు,పసి పిల్లలకు,వృద్ధులకు రక్షణ కల్పించ లేని లంగా పాలకులు నేడు దచ్చా ఉపన్యాసాలతో వారి రాజకీయ ఉనికిని కాపాడుకుంటున్నారు . అభివృద్ధిని,భద్రతను సాధించి చూపిస్తాం . అందుకు మాకు దమ్ముంది . ప్రస్తుత పాలకులకు దమ్ముంటే స్వచ్ఛందంగా వైదోలిగి పాలనను మాకు అప్పగించి చూడంటి కోల్పోయిన అభివృద్ధిని , భద్రతాను, భవిష్యత్ ను సాధించి ప్రజల దరికి చేరుస్తాం.అందుకు మీరు సిద్ధమా !మేము సిద్ధం అని ఆయన భహిరంగ సవాల్ చేసారు . నేటి అవినీతి పాలకులతో ఆంధ్రప్రదేశ్ కు భవిష్యత్ ఉంటుందా ! అనే ఆశ రోజు రోజు కు సన్నగిల్లి పోతుందని , నిత్యం ఉద్యమాలు , ఆకలి జీవితాలతోనే రోజులు గడిచి పోతున్నాయి . కార్పొరేట్ మీడియా అకృత్యాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది . పట్ట పగలు సైతం కారు మబ్బులు కమ్మిస్తూ నిజాలను భూ స్థాపితం చేస్తున్నారు . అవినీతి ఊబిలో కూరుకుపోయిన మన ఆంధ్ర రాష్ట్ర పాలకులు నాబి వున్న మూగవాని వలే, కర్ణబేరి వున్నా చెవిటి వాని వలే , దేహం వున్నా సజీవ దేహం వలే, మెదడు వున్నా మానసిక వికలాంగునివలె , అవయవాలు వుండి అంగ వైకల్యాని వలే మొత్తంగా సజీవ శవం వలే జీవించటానికి అలవాటుగా బ్రతికేస్తున్నారు . ఒకప్పుడు నేతలకు , పాలకులకు ఆత్మభిమానం, సిగ్గు, శరం ఉండేది . వారి అసమర్థతకు కుటుంబ సభ్యులకు సైతం మొఖం చూపించటానికి ఇబ్బంది పడేవారు . ఇప్పటి నేతలు ఎన్ని అబద్దాలు ఆడితే అంత గొప్ప నేతగా కార్పొరేట్ కిరాయి మీడియా కితాబులతో కిరాయి కీర్త నలతో మమా అనుకుంటు సంతృప్తి పడుతున్నారు . నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేస్తున్నారు . సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు . బిడ్డల భవిష్యత్ కు శాపగ్రస్తులు అపకీర్తిని మూటగట్టు కుంటున్నాము అనే సోయ లేకుండా పూల మాలలు దరిస్తు ఊరేగటం మన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పాలకులకే చెల్లిందని , నేటి అవినీతి పాలకుల స్వార్ధనికి రాష్ట్రం విల విల లాడుతుందని, అందు కోసమే ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి ని సాధించాటానికి అన్ని వర్గాల ప్రజలు మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన కోరారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ సిమ్మా దుర్గారావు,దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , వాడపల్లి జ్యోతిష్ ,ఆకుల మణికాంత్ ,చల్లా సాంబశివరావు,చల్లా వంశీ , సుంకర వెంకట భాస్కర రంగారావు,అలజంగి రాజు , మాసా అప్పాయమ్మ , పసుపులేటి వీర్రాజు, పైడిమళ్ళ ఏసోబు, కాకర ప్రసాద్,అనిశెట్టి నిర్మలా రూత్,పసుపులేటి సుశీల, మాసా కుశలయ్య పాల్గొన్నారు.

## నారా లోకేష్ అయ్యన్నపాత్రుడులను మర్యాద పూర్వకంగా కలిసిన బత్తుల.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** రాష్ట్ర విద్యా ఐటీ కమ్యూనికేషన్ శాఖ మాత్యులు నారా లోకేష్, శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ఆదివారం రాష్ట్ర నీటిపారుదలశాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్ధం సందర్భంగా పలువురు రాష్ట్ర ప్రముఖులు మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. విమానాశ్రయంలో నారా లోకేష్, అయ్యన్నపాత్రుడులను బత్తుల వెంకటలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుత్యం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్డీవో కృష్ణ నాయక్, పలువురు ఎన్డీఏ నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు18న సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథాతధంగా

**-1100 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కార వేదిక**
**- 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందుబాటులో**
**- కలెక్టర్ పి ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార) కార్యక్రమం ఈ నెల ఆగస్టు 18 వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించ బడుతుందని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలోజరుగుతున్న పీజీఆర్ఎస్లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారని, అందువల్ల ప్రజలకు సమయం మరియు ఖర్చు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. అర్జీల స్వీకరణ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగుతుంది. ప్రజలు"మీ కోసం"1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, ఇప్పటికే నమోదు చేసిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు.అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా పౌర సేవలు పొందవచ్చని, ఈ నంబర్ను తమ సెల్ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. నేరుగా హాజరు కాలేకపోయిన వారు meekosam.ap.gov.in పోర్టల్ ద్వారా ఆన్లైన్లో అర్జీలు నమోదు చేసుకునే వీలుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈవినూత్న మాధ్యమాలను ఉపయోగించి తమ సమస్యలను పరిష్కరించు కోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

## ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తాం..

**ఎస్సి,ఎస్టి,టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఎ పి రాష్ట్ర అధ్యక్షులుగా ఎం.డి సత్యనారాయణరెడ్డి నియామకం**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఎస్సి,ఎస్టి,టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎం.డి సత్యనారాయణరెడ్డి (తూర్పుగోదావరి జిల్లా) , రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా అన్ను వెంకటరావు (పార్వతీపురం మన్యం జిల్లా)నుంచి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతర పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం పిఆర్ సి ఇవ్వాలని,డి.ఎ బకాయిలు ఇవ్వాలని, ఉపాధ్యాయుల పని వత్తిడి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన చేసేలా ఉపాధ్యాయలపై వత్తిడి లేని అవకాశాలు కల్పించాలన్నారు. అందుకు విద్యాశాఖ మంత్రిత్వ శాఖ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం తప్పక ఉండాలని,10వ తరగతి విద్యాబోధనకు కూడ తెలుగు మీడియం ఉండాలన్నారు.పరీక్షలకు బుక్ లెట్ విధానం విపరీతమైన పనిభారం పెంచేసిందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. త్వరలో వీటన్నిటి పైన సమగ్రమైన నివేదిక తో విద్యాశాఖ మంత్రిని కలసి మాట్లాడతామని ఎస్సి,ఎస్టి, టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

## జియోన్ ఆశ్రమానికి నిత్యవసర వస్తువులను అందించిన మోహన్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మోహన్ ఆర్థిక సహాయంతో 10వేల రూపాయలు విలువ గల నిత్యవసర వస్తువులను రాజమండ్రి స్థానిక 2వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా జియోన్ అంధుల,వికలాంగుల అనాధాశ్రమానికి వితరణ చేయడం జరిగింది అని ప్రత్తిపాటి నాగరాజు ప్రకటనలో తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ మోహన్ టీచర్ గత 15 సంవత్సరాల నుండి ఈ ఆశ్రమానికి అనేక విధాలుగా సహాయం చేస్తూ వస్తున్నారు.ఆదివారం ఉదయం ఈ కార్యక్రమంలో స్వయంగా వారి చేతుల మీదగా నిత్యవసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా మోహన్ కు దేవోక్తి టీం సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, సాధనాల కిషోర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం అగ్రభాగాన నిలబడుతుంది





**సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం ఎ బేబీ**

**పోలవరం నిర్వాసితుల సమస్యలను ఒక్కసారైనా చట్టసభల్లో ప్రస్తావించని వైసిపి టిడిపి ఎంపీలు**

**కేరళ పునరావాస కాలనీలు ఆదర్శవంతంగా వామపక్ష ప్రభుత్వం నిర్మించింది**

**రాజ్యసభ సభ్యులు, ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్**

**రెండవ రోజు చింతూరు, వి ఆర్ పురం, ఎటపాక మండలాల్లో పర్యటించిన సిపిఎం నాయకత్వం**

**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం అగ్రభాగాన నిలుస్తుందని,ఈ సమస్యలను జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లనున్నామని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎం ఏ బేబీ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల పర్యటన లో ఆదివారం చింతూరు, వి ఆర్ పురం, ఎటపాక మండలాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా వి ఆర్ పురం మండలం రామవరం లో బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక నాయకులు పులి బుజ్జి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఏ బేబీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వేల కోట్లతో రాజధాని నిర్మించేందుకు ప్రణాళికల రూపొందిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలకు మేము వ్యతిరేకం కాదని అయితే పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎందుకు పరిష్కరించరు అని ప్రశ్నించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం, గత వైసిపి ప్రభుత్వం మూడు ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యే అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు, మెరుగైన మౌలిక వసతులతో కూడిన కాలనీలో నిర్మించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితిలో పూర్తి భిన్నంగా ఉన్నాయని వివరించారు. గడిచిన రెండు రోజులు పర్యటనలు పలు కాలనీ సందర్శించి పోలవరం నిర్వాసితులతో మాట్లాడామని ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలే దర్శనమిచ్చాయన్నారు. నిర్మాణాలు పూర్తి చేసి మూడు నాలుగు ఏళ్ళు గడవక ముందే స్లాబులు నుంచి వర్షం నీరు కారణంతో బరకాలు కట్టుకుని ప్రజలు కాపురాలు ఉంటున్నారని తెలిపారు. అటువంటి గృహాలు గుడిసెలు తలపిస్తున్నాయని మండిపడ్డారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి 55 వేల కోట్లతో డిపిఆర్ రూపొందించగా కేంద్ర ప్రభుత్వం కేవలం 2200 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ఆ విడుదల చేసిన నిధులలో గత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసానికి కేవలం 7000 కోట్లు మాత్రమే ఖర్చు చేసేయ్ అన్నారు. ఈ ఖర్చు చేసే నిధులలోను అత్యధిక భాగం రాజకీయ పెద్దలు, అధికారులు, కాంట్రాక్టర్లు కొమ్మక్కొయ్యి లూటీ చేసినట్లు స్పష్టమవుతుందని అన్నారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీసం ఉపాధి పనులైన అన్ని గ్రామాల్లో కల్పించాలని కోరారు. అదేవిధంగా పోలవరం, ఇతర పనులలో నిర్వాసితుల కుటుంబాలకి ఉద్యోగం కల్పించాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఎకరాకు 20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.సిపిఎం రాష్ట్ర కమిటీ ఇప్పటికే పోలవరం నిర్వాసితుల సమస్యలను గుర్తించి పోరాటాల నిర్వహిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమం మరింత తీవ్రతరం చేయాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు ఫ్లోర్ లీడర్ జాన్ బ్రెట్టాస్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత కాలనీలు సందర్శించి నిర్ఘాంత పోయానని తెలిపారు. కనీస మౌలిక వసతులు కల్పించలేదని వివరించారు. పోలవరం నిర్వాసితుల సమస్య తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం, వైసిపి ఎంపీలు రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో ఎందుకు ప్రశ్నించర లేదని నిలదీశారు. కేరళలో నిర్మించిన పునరావాస కాలనీలలో విద్యా వైద్యం రవాణా సౌకర్యాలతో పాటు కాలనీలో నివసించే ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, నీళ్లు నిలిపి పోలవరం నిర్వాసితులను అనివార్యంగా వెళ్లగొట్టేందుకు చేస్తున్న కుట్ర పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా ఉందని మండిపడ్డారు. ఇటువంటి కుట్రలను సిపిఎం అనుమతించబోదని హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల పక్షాన సిపిఎం పోరాడుతుందని తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి పోలవరం రెండు కళ్ళంటూ చేస్తున్న ప్రకటనలను గుర్తు చేశారు. అయితే పోలవరం అంటే ప్రాజెక్టు మాత్రమే కాదని, ఆ ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. వి ఆర్ పురం మండలం రామవరం లో అధికార యంత్రాంగం వేసిన కాంటూరు కాకి లెక్కలకు ఒక ఉదాహరణ అని చెప్పొచ్చు అన్నారు. ఈ గ్రామంలో 279 గృహాలు ఉంటే రోడ్డుకు ఒకవైపు ఉన్న 166 గృహాలు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని వివరించారు. రోడ్డుకు మరోవైపు ముంపు ఉండదా అని ప్రశ్నించారు. రంపచోడవరం జిల్లా సిపిఎం కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను సిపిఎం జాతీయ సమస్యలుగా గుర్తించిందని, రాబోయే రోజులలో నిర్వహించే పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, బి.బలరాం, రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు, మాట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, సున్నం రాజులు,పులి సంతోష్, సీసం సురేష్, ఎం పి పి కారం లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు సిపిఎం జాతీయ నాయకత్వానికి అందచేశారు.

# లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**దేవరకద్ర :** లైసెన్స్ లేకుండా ఎవరైనా వాహనాలు నడిపితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక డిఎస్పి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. దేవరకద్ర మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి తొమ్మిది గంటల వరకు డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. పురవీధుల గుండా మొత్తం పోలీసు బృందాలు విడివిడిగా తిరుగుతూ లైసెన్స్ లేని వాహనాలను ఆర్సి లేని వాహనాలను ఎలాంటి పత్రాలు కూడా లేని వాహనాలను పోలీసులు స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ డిఎస్పి యువకులతో మాట్లాడుతూ యువకులు వాహనాలు నడిపేటప్పుడు కాస్త జాగ్రత్తగా నడపాలని ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా లైసెన్సులు ఏర్పాటు చేసుకోవాలని లైసెన్స్ లేకుండా వాహనాలు నడిస్తే అలాంటి వారిపై చట్టం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒకరు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేకపోతే ప్రాణానికి హానికరం అవుతుందని అందుకు తప్పనిసరిగా వాహనాలు నడిపేవారు హెల్మెంట్ ధరించాలని ఆయన కోరారు. గతంలో చాలా ప్రమాదాలు జరిగాయని అలా జరగకుండా ఉండేందుకు గ్రామాలలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం


## నాగులవంచ రైల్వేస్టేషన్ పునఃప్రారంభం



మధిర : ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఖమ్మం–విజయవాడ ప్రధాన రైలు మార్గంలో చరిత్ర కలిగిన నాగులవంచ రైల్వేస్టేషన్‌ను ఇటీవల మూసివేశారు. రైల్వేస్టేషన్ మూసివేత వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఈ ప్రాంత ప్రజలు రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుకెళ్లారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శనివారం రైల్వే ఉన్నత అధికారులు రైల్వే స్టేషన్ ఎత్తివేతను నిలిపివేస్తూ జీవో జారీచేశారు. వారి ఆదేశాల మేరకు ఖమ్మం రైల్వే కమర్షియల్ డిపార్టుమెంట్ అధికారి శ్రీనివాసులు ఆదివారం రైల్వేస్టేషన్‌ను పునఃప్రారంభిచారు. ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ టికెట్ బుకింగ్ క్లర్క్‌గా శేష్ కుమారిని నియమించారు. విజయవాడ–భద్రాచలం రోడ్డు, డోర్నకల్–విజయవాడ వెళ్లు ప్రయాణికులకు టికెట్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాస్, పరిటాల యలమంద, కోపూరి నవీన్, ఆలస్యం బసవయ్య, బొర్రా ప్రసాద్, కొల్లి బాబు, అంబటి శాంతయ్య, వేణు వివిధ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ స్పెషల్ బాదుడు!




ఎల్లారెడ్డి : ఒకవైపు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరోవైపు ప్రత్యేక రోజుల్లో అడ్డగోలుగా టికెట్ల ధరలు పెంచి అందినకాడికి దోచుకుంటున్నది. ముఖ్యంగా పండుగ సందర్భంగా ఆర్టీసీలో పెరిగిన రద్దీని ముందే పసిగట్టిన అధికారులు.. స్పెషల్ పేరుతో ప్రత్యేక బాదుడుకు తెరలేపారు. పల్లెవెలుగు బస్సులను ప్రత్యేకంగా నడిపిస్తూ ప్రయాణికులను నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డి బస్టాండ్ నుంచి బాలానగర్ వెళ్లడానికి భవానీపేట్ గ్రామానికి చెందిన నవీన్ పల్లె వెలుగు బస్సు ఎక్కాడు. రూ.270 టికెట్ ఇవ్వడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కండక్టర్‌ను ఇదెక్కడి వడ్డింపు అని అడిగినా లాభం లేకుండా పోయింది. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.250 ఉండగా.. పల్లెవెలుగు స్పెషల్ బస్సుకు 270 రూపాయలు తీసుకోవడం చాలా ఎక్కువ అని సదరు ప్రయాణికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. పండుగల సమయంలో ఆర్డినరీ బస్సులను స్పెషల్ పేరుతో ప్రయాణికుల నుంచి ముక్కుపిండి డబ్బులను వసూలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

# కాకతీయుల రహస్య సొరంగాలున్న నేల ఇదే..

రాణీ రుద్రమ సైన్యం యుద్ధ తంత్రాలకు వేదిక... కాకతీయుల కోట వరకు రహస్య సొరంగాలున్న నేల... ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు నెలవైన ప్రాంతం... వరంగల్ నగరానికి కూతవేటు దూరంలో... గీసుకొండ మండలం మొగిలిచర్లలో కాకతీయుల కాలంలో నిర్మిం చిన 'ఏకవీర' ఆలయం ఉంది.

మహారాష్ట్రలోని మహూర్‌లో ఉన్న 'ఏకవీర దేవికా' ఆలయానికీ, దీనికి పోలిక ఉంది. అక్కడ రేణుకా మాతకు... ఇక్కడ రేణుకా ఎల్లమ్మకు ఇప్పటికీ పూజలు జరుగుతున్నాయి.

కాకతీయుల 'ఏకవీర'గా చెప్పుకునే ఆలయ విశేషాలివి...

కాసే సర్వప్ప రచించిన 'సిద్దేశ్వర చరిత్ర'లో కాకతీయ రుద్రదేవుడు (క్రీ.శ.1042 నుంచి 1130) మహాశక్తికి గుడి కట్టించినట్లు ఉంది. వరంగల్ జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో మొగిలిచర్ల గ్రామంలో ఈ 'ఏకవీర' దేవాలయం ఉంది.

వినుకొండ వల్లభరాయుడు రచించిన క్రీడాభిరామం వంటి పురాతన గ్రంథాల్లో కూడా ఈ దేవాలయంపై ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గర్భ గుడి అంతరాలు చిన్న గదులుగా 28 స్తంభాలతో విశాలమైన అర్ధమంటపంతో కూడిన దేవాలయం ఇది. ఎనిమిది పెద్ద స్తంభాలు ఉండగా, మధ్యలో నాలుగు, గర్భ గుడి ముందు రెండు, దాని లోపల రెండు స్తంభాల చొప్పున ఏర్పాటు చేశారు. మరో 20 చిన్న స్తంభాలు ఆలయానికి తూర్పు వైపున ఉన్నాయి. మొత్తంగా ఈ ఆలయం శిలా ఫలకంపై నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. అలాగే దేవాలయానికి ముందు 20 అడుగుల దూరంలో ఉన్న ఇసుక రాతి గుండ్లను తొలిచి చేసిన గుహలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. రెండింటిలోనూ పానవట్టాలు, లింగ ప్రతిష్ట కొరకు తొలిచిన గుంటలు ఉన్నాయంటున్నారు. ఒకదానిలో రాతి అరుగునే పానపట్టంగా మార్చి శివలింగ ప్రతిష్ట చేసినట్టుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆ రెండు రాతి గుహల నడుమ మరొక గుండుకు తొలచిన



అర్ధశిల్పా మంటపాలు దీర్ఘ చతుర ప్రాకారాలుగా ఉన్నాయి. తొలుత జైనులైన కాకతీయ పాలకులు శైవులుగా మారడంతో ఎన్నో జైన దేవాలయాలు శైవాలయాలుగా మారాయి. 'మొగిలిచర్ల కూడా ఒకప్పటి జైన స్థానమేనని చెప్పడానికి అనేక చారిత్రక ఆధారాలున్నాయ'ని చరిత్రకారుడు అరవింద్ ఆర్య పేర్కొన్నారు.

**రుద్రమదేవి యుద్ధతంత్రాలు ఇక్కడే...**

రాణి రుద్రమదేవికి పట్టాభిషేకం పూర్తయిన తరువాత ఐదు రాత్రులు నిద్రపోకుండా... పంచ రాత్ర వ్రతం ఈ 'ఏకవీర' ఆలయంలోనే చేసినట్లుగా చారిత్రక కథలున్నాయి. రుద్రమ దేవి కాలంలో ఏకవీర ఆలయంలో నిత్యం పూజలు, హోమాలు జరిగేవి. ఇక్కడే కాకతీయ సైన్యానికి యుద్ధతంత్రాలపై శిక్షణ ఇచ్చేవారట. హరిహరదేవుడు, మురారి దేవుడు తిరుగుబాటుకు ప్రయత్నిస్తున్నారని తెలిసిన రుద్రమదేవి... వారిని మొగిలిచర్ల వద్దనే నిలువరించి, ఓడించి, బంధించింది. రుద్రమ ఏకవీరాదేవి గుడికి వెళ్తున్నపుడు దేవగిరి రాజు మహదేవుడు అడ్డగించి యుద్ధానికి దిగాడు. వారిని రుద్రమదేవి తరిమికొట్టింది ఇక్కడి నుంచే అని చరిత్రకారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఈ ఆలయం నుంచి వరంగల్ కోట వరకు రహస్య సొరంగం ఉందనిఅంటున్నారు. ఈ ప్రాంతం సైనికులకు శిక్షణ కేంద్రంగా ఉండటంతో... కాకతీయ పాలకులు ఈ రహస్య సొరంగం నుంచే ఇక్కడికి తరుచూ వచ్చేవారని చెబుతున్నారు.

**రెండింటికీ పోలిక...**

విషాదం ఏమిటంటే... ఈ ఆలయంలో ఏకవీర దేవి విగ్రహం అపహరణకు గురైంది. ప్రస్తుతం ఆలయంలో అనేక విగ్రహలతో పాటు రేణుకా ఎల్లమ్మ విగ్రహం ఉంది. కుండలాలు, కంఠాభరణాలు, దండకడియాలతో వీరాసనంలో కూర్చొని ఉన్న ఎల్లమ్మ శిల్పం ఉంది. నడుముకు కిందిభాగాన వస్త్రం చెక్కి ఉంది. కుడిముంజేత ఖడ్గం, వెనుక కుడిచేత ఢమరుకం, ఎడమ చేతిలో పానపాత్ర, వెనుక ఎడమ చేత త్రిశూలం చెక్కి ఉన్నాయి. అయితే ఇదే తరహాలో అష్టాదశ శక్తిపీఠాల్లో ఎనిమిదో పీఠంగా మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా మహూర్‌లోని ఏకవీరదేవికా ఆలయం ఉంది. ఇక్కడ ఆలయం చాలా చిన్నదిగా ఉండటంతో... పక్కనే ఉన్న రేణుకా మాతనే శక్తిపీఠంగా కొలుస్తారు. మొగిలిచర్ల ఏకవీర ఆలయంలో రేణుకా ఎల్లమ్మ... మహూర్‌లోని ఏకవీర ఆలయంలో రేణుకా మాతలను కొలవటం యాదృచ్ఛికమే అయినప్పటికీ... అక్కడి శక్తిపీఠంతో ఈ ఆలయానికి పోలికలు ఉండటంపై చరిత్ర కారులు పరిశోధనలు చేస్తున్నారు. అయితే ఈ చారిత్రాత్మక ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయంలో గుప్త నిధుల కోసం జరిగిన తవ్వకాల్లో అనేక విగ్రహాలు, ఆలయ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఈ ఆలయం పునరుద్ధరణతో పాటు ఏకవీర దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే... చరిత్రకు నగిషీలు చెక్కినట్టే.

# శిశువులకు జన్మనిచ్చే రోబో
# చైనాలో పరిశోధకుల అద్భుత సృష్టి

**ప్రపంచంలో తొలి ప్రెగ్నెన్సీ రోబో ఇదే**
**వచ్చే ఏడాది చివరిలోగా ప్రొటోటైప్ రెడీ**



**న్యూఢిల్లీ :** చైనాలో పరిశోధకులు ప్రెగ్నెన్సీ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. గర్భాన్ని ధరించడంతోపాటు కృత్రిమ గర్భంలో నవమాసాలు శిశువును మోసి, సురక్షితంగా ప్రసవించడం ఈ రోబో ప్రత్యేకత. ప్రపంచంలో తొలి 'ప్రెగ్నెన్సీ రోబో' ఇదే. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఈ రోబోను అభివృద్ధి చేస్తున్నట్టు చైనా మీడియా వెల్లడించింది. నెలలు నిండకుండా జన్మించే శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంక్యుబేటర్ల కంటే ఈ రోబో చాలా భిన్నమైనది. గర్భాన్ని ధరించడం మొదలుకొని శిశువు జననం వరకు మొత్తం గర్భధారణ ప్రక్రియను ఈ రోబో అనుకరిస్తుంది. అంటే గర్భధారణ నుంచి ప్రసవం వరకు శిశువు పూర్తిగా హ్యూమనాయిడ్ రోబోలోని టెక్ గర్భంలో పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో కృత్రిమ గర్భ సాంకేతికత (ఆర్టిఫిషియల్ ఊంబ్ టెక్నాలజీ) ప్రధానమైనది. రోబో బొడ్డులో అమ్నియోటిక్ ద్రవంతో నింపిన కృత్రిమ గర్భం మానవ గర్భాన్ని అనుకరిస్తూ పిండం పెరుగుదలకు అనువైన పరిస్థితిని కల్పిస్తుంది. సహజంగా జన్మించే శిశువుకు జరాయువు (ప్లాసెంటా) ద్వారా పోషకాలు అందినట్టు ప్రెగ్నెన్సీ రోబోలో కృత్రిమ గర్భానికి జత చేసిన ట్యూబ్ ద్వారా శిశువుకు పోషకాలు అందుతాయి. కృత్రిమ గర్భ సాంకేతికత ఇప్పటికే పరిణితి చెందిన దశలో ఉన్నదని, ఇప్పుడు దీన్ని రోబో ఉదరంలో అమర్చాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా నిజమైన వ్యక్తి ఆ రోబోతో ఇంటరాక్ట్ అయి గర్భధారణకు, ఆ గర్భంలో పిండం పెరుగుదలకు వీలు కల్పించాల్సి ఉన్నదని డాక్టర్ జాంగ్ వివరించారు. నిజానికి ఇదేమీ పూర్తిగా కొత్త భావన కాదని, గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ 'బయోబ్యాగ్'లో గొర్రెపిల్లను విజయవంతంగా పెంచారని, ఆర్టిఫిషియల్ ఊంబ్ ఆలోచనకు అప్పుడే బీజం పడిందని తెలిపారు. ప్రెగ్నెన్సీ రోబో ప్రొటోటైప్ (నమూనా) వచ్చే ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, అందుకు దాదాపు లక్ష యువాన్లు (రూ. 12.96 లక్షలు) ఖర్చవుతుందని అంచనా.

# మరో 15 రోజులే ఉన్నాయి..
# మా తలుపులు తెరిచే ఉంటాయి




**న్యూఢిల్లీ:** బిహార్ ముసాయిదా ఎన్నికల జాబితాలో సవరణలకు మరో 15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. అన్ని పార్టీలకు సమానంగా ఈసీ తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పారు. బీహార్ ఎస్ఐఆర్ కింద ముసాయిదా ఎన్నికల జాబితాపై ఏ రాజకీయ పార్టీకి ఎలాంటి అనుమానులు ఉన్నా తమను సంప్రదించవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలకు సబంధించిన వివిధ అంశాలపై ఆదివారం మధ్యాహ్నం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.
ఇటీవల జరిగిన ఎన్నికల్లో సిసీటీవీ ఫుటేజ్‌ను షేర్ చేయకపోవడానికి ఓటర్ల ప్రైవేసీని కాపాడాలన్నదే కారణమని సీఈసీ చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌ను ఎన్నికల కమిషన్ షేర్ చేయకపోవడంపై రాహుల్ గాంధీ సారథ్యంలోని పలు విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అవకతవకలు చోటుచేసుకోవడమే దానికి కారణమని తప్పుపట్టాయి. దీనిపీ సీఈసీ మాట్లాడుతూ, మెషీన్-రిడబుల్ ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి సుప్రీంకోర్టు 2019లో చాలా స్పష్టంగా చెప్పిందని, ఇందువల్ల ఓటర్ల ప్రైవసీకి భంగం కలుగుతుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొందని తెలిపారు. గత కొద్దిరోజులుగా పలువురు ఓటర్ల ఫోటోలు వాడుకుంటూ వాటిని మీడియాకు ఫార్వార్డ్ చేస్తుండటం చూస్తున్నామని, అలాంటప్పుడు మన తల్లులు, ఆడకూతుళ్ల ఫోటోలతో కూడిన సీసీటీవీ ఫుటేజ్‌ను కమిషన్ షేర్ చేయాలా? అని సీఈసీ ప్రశ్నించారు.

**బెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌పై..**
పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఎప్పుడు నిర్వహించాలనేది ఎన్నికల సంఘం నిర్ణయిస్తుందని, తగిన సమయంలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని సీఈసీ తెలిపారు. ఎన్నికల ముందు ఎన్నికల జాబితాను సవరించడం ఎన్నికల కమిషన్ పని అని ఒక ప్రశ్నకు సమాధానంగా జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

## మోదీ చాలా ప్రమాదకారి..
## గద్దె దింపాలి




సాసారాం: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా శుక్రవారంనాడు ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రశంసించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. ప్రధాన మంత్రి 'చాలా ప్రమాదకర వ్యక్తి' అని, ఆయనను అధికారం నుంచి తొలగించాలని అన్నారు. బీహార్‌లోని సాసారాంలో ఆదివారంనాడు జరిగిన విపక్ష ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, బీజేపీని అధికారం నుంచి తొలగించేంత వరకూ ప్రజల ఓట్లు, హక్కులు, స్వేచ్ఛకు, చివరకు రాజ్యాంగానికి కూడా భద్రత లేదని అన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, అలాంటి వ్యక్తులను ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి పొడగటం ఏమిటని ఖర్గే ప్రశ్నించారు. 'మీ వాళ్లెవరూ జైలుకు (స్వాతంత్ర్య పోరాటంలో) వెళ్లలేదు. ఉద్యోగాలు కావాలంటూ మీవాళ్లు బ్రిటిష్ వారికి దరఖాస్తులు చేసుకున్నారు. మేము వాళ్లతోనే ఉంటామని కూడా తెగేసి చెప్పారు. అలాంటి వ్యక్తుల పేర్లను ఎర్రకోట నుంచి ప్రధాని ప్రస్తావించడమంటే దేశ స్వాతంత్ర్య కోసం ప్రాణత్యాగాలు చేసిన వారి ఆత్మలకు మీరెలాంటి సమాధానమిస్తారు' అని ఖర్గే నిలదీసారు. ఆ కారణంగానే ఆయన (మోదీ) చాలా ప్రమాదకరమైన వ్యక్తని తాను చెప్పగలనని అన్నారు. ప్రధాని మోదీని గద్దె దింపేంత వరకూ, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తొలగించేంత వరకూ రాజ్యాంగానికి, ప్రజల హక్కులకు ముప్పు ఉంటుందని ఖర్గే అన్నారు. ప్రజల ఓట్లు, యువత ఉద్యోగాలు, రైతుల నుంచి ఎంఎస్‌పీని మోదీ దోచుకుంటున్నారని విమర్శించారు.

# భారత్‌కు మరో షాకిచ్చిన అమెరికా..
# ట్రంప్ ప్లాన్ అదేనా?


Image credit: x.com/POTUS

**ఢిల్లీ:** భారత్, అమెరికా మధ్య మాటల యుద్ధం కొనసాగు తున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాణిజ్య చర్చల కోసం భారత్‌కు రావాల్సిన అమెరికా బృందం ట్విస్ట్ ఇస్తూ.. తమ పర్యటనను రద్దు చేసుకుంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దీంతో, వారి తదుపరి పర్యటనపై సస్పెన్స్ నెలకొంది. వివరాల ప్రకారం.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అ?ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌ను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంతో భారత్‌పై అమెరికా భారీగా సుంకాల భారాన్ని మోపింది. ట్రంప్ ఇటీవల భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు. పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అదనపు 25% టారిఫ్‌లు ఈ నెల 27ను అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో సుంకాలు అమలులోకి రాకముందే.. అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపి మధ్యంతర ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో దీనికి సంబంధించి ఇప్పటికే ఇరు దేశాల ప్రతినిధుల మధ్య ఐదు దఫాలు చర్చలు జరిగాయి. ఆరో దఫా చర్చలకు అమెరికా ప్రతినిధులు ఈ నెల 25-29 మధ్య భారత్‌లో పర్యటించాల్సి ఉంది. ఈ దఫా చర్చల్లో భాగంగా.. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలకు సంబంధించిన చిక్కుముడులు వీడే అవకాశం ఉందని అందరూ భావించారు. అయితే, తాజాగా వారు ఆ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. చర్చలకు సంబంధించిన తదుపరి తేదీలను కూడా వారు వెల్లడించలేదు. దీంతో, మరోసారి ఇరు దేశాల మధ్య చర్చలు ఉంటాయా? లేదా? అనే సందిగ్ధత నెలకొంది. ఒకవేళ చర్చలు విఫలమైతే.. భారత్‌పై టారీఫ్‌ల భారం పడే అవకాశం ఉంది. కాగా, భారత్‌పై సుంకాలు విధించాలనే ఆలోచనతోనే ట్రంప్ ఇలా ప్లాన్ చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, భారత్‌ను టార్గెట్ చేసి ట్రంప్ సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ దేశ ప్రజలకు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆయన మరోసారి అమెరికాలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ట్రంప్‌తో కూడా ఆయన భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య చర్చలు సఫలం అవుతాయా? అని అందరూ ఆసక్తికంగా ఎదురుచూస్తున్నారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ :** వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్టు కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఆదివారం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఉంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తాము విపక్షాలతో కూడా సంప్రదిస్తున్నామని, ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించాలని వారిని కోరుతున్నామని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభల్లో 786 మంది సభ్యులుండగా, ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికి కనీసం 394 ఓట్లు అవసరం. అయితే ఎన్డీఏ కూటమికి రెండు సభల్లో కలిపి 422 ఓట్లు ఉన్నాయి. దీంతో ఆ అభ్యర్థి ఎన్నిక నల్లేరు మీద బండిగా భావిస్తున్నారు. కాగా, ఇంతకుముందు ఉప రాష్ట్రపతిగా పనిచేసిన జగదీప్ ధన్‌ఖడ్ కూడా ఆ పదవికిలోకి రాకముందు గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఆగస్టు 21 ఆఖరు తేదీ. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖ నేతలు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి దింపేందుకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నట్టు ఇండియా కూటమి తెలిపింది.

**'తమిళనాడు మోదీ'గా గుర్తింపు**
ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957, అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. తమిళనాడులో ప్రభావవంతమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన ఈ ఓబీసీ నేతకు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో సుమారు 40 ఏండ్ల అనుభవం ఉంది. తమిళనాడు మోదీగా ఆయనను పిలుస్తారు. 2003 నుంచి 2006 వరకు ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న ఆయన తమిళనాడులో రెండు సార్లు ఎంపీగా చేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 2024, జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 ఫిబ్రవరి 18 నుంచి 2024 జూలై 30 వరకు జార?ండ్ గవర్నర్‌గా, 2024 మార్చి నుంచి జూలై వరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా 2024 మార్చి నుంచి ఆగస్టు వరకు పనిచేశారు.

## ఎస్ఐఆర్ అసలు రంగును బయటపెడతాం



ఢిల్లీ: బీహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని మరోసారి స్పష్టం చేశారు ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. బీహార్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ద్వారా ఉన్న ఓటర్లను తొలగించి కొత్త వారిని చేర్చి అక్రమంగా గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, దేశం ఎక్కడ ఓట్ల చోరీ జరిగినా అడ్డుకుంటామని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బీజేపీ నేతలు ప్రెస్‌మీట్ పెడితే ఈసీ అఫిడవిట్ అడగలేదని, తాను ప్రెస్‌మీట్ పెడితే అఫిడవిట్ ఈసీ అడుగుతోందని విమర్శించారు. ఓటర్ల డేటాను అడిగినా ఈసీ ఇంతవరకూ ఇవ్వలేదని ధ్వజమెత్తారు రాహుల్. మీ ఓట్లను దొంగిలించి.. ఎన్నికల్లో గెలిచి దేశ సంపదను సంపన్నులకు అందిస్తున్నారని మండిపడ్డారు. బీహార్‌లో చేస్తున్న ఎస్ఐఆర్ అసలు రంగు బయటపెడతామని రాహుల్ హెచ్చరించారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం( ఆగస్టు 15వ తేదీ) మరోసారి విచారించిన సుప్రీంకోర్టు.. ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం(ఆగస్టు 14వ తేదీ) విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం? ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది.

## కశ్మీరులో మరో మేఘ విస్ఫోటం..



శ్రీనగర్ : ఈ నెల 14న కురిసిన కుంభవృష్టి నుంచి జమ్ముకశ్మీరులోని కిష్టార్ తేరుకోకముందే, శని-ఆదివారాల మధ్య రాత్రి కథువా జిల్లాలో మేఘ విస్ఫోటం(క్లౌడ్ బరస్ట్) సంభవించింది. దీంతో ఏడుగురు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. కథువా జిల్లా అభివృద్ధి కమిషనర్ రాజేశ్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు, పోలీసులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు. జోధ్ ఘాటీ గ్రామానికి ఇతర ప్రాంతాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. జంగ్లోటే ప్రాంతంలో కొండచరియ విరిగిపడటంతో ఇద్దరు మరణించారు. జోధ్ ఘాటీలో గాయపడిన ఐదుగురిని దవాఖానకు తరలించినట్లు అధికారులు చెప్పారు. కొండచరియలు విరిగిపడటంతో బగర్డ్, చాంగ్డా, దిల్వాన్-హుట్లి గ్రామాలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు కురియడంతో చెరువులు, కుంటలు నిండిపోయాయి, ఉఝ్ నది ప్రమాద స్థాయికి సమీపంలో ప్రవహిస్తున్నది. చెరువులు, కుంటలు, కాలువలకు దూరంగా ఉండాలని ప్రజలను అధికారులు కోరారు. కుంభవృష్టి వల్ల ప్రాణ నష్టం సంభవించడంపై జమ్ముకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలియజేశానని చెప్పారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.1 లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కిష్టార్‌లో ఈ నెల 14న కురిసిన కుంభవృష్టి వల్ల దాదాపు 60 మంది మరణించారు, అనేక మంది గల్లంతయ్యారు.

# ఆ మూలికా ఔషధాలతో ముప్పు!



## సగానికిపైగా వాటిలో అధిక సూక్ష్మక్రిములు
## హైదరాబాద్ దుకాణాల్లో కలుషిత హెర్బల్ డ్రగ్స్
## 170 ఔషధాలు పరీక్షించిన ఐసీఎంఆర్ – ఎన్ఐఎన్

హైదరాబాద్‌లోని హెర్బల్ డ్రగ్స్ దుకాణాల్లోని ఔషధాలు సూక్ష్మ క్రిములతో కలుషితం అయిపోయాయట. భారతీయ వైద్య పరిశోధనామండలి (ఐసీఎంఆర్)కి చెందిన జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్తల తాజా పరిశోధనల్లో వెల్లడైన వాస్తవాలివి. ఎన్ఐఎన్ పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగం శాస్త్రవేత్త ముళ్లపూడి వెంకట సునీత సారథ్యంలో 9 మంది శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. ఇది తాజా అధ్యయనం. అధ్యయన ఫలితాలతో కూడిన సమగ్ర వ్యాసం సైన్స్ డైరెక్ట్ వారి జర్నల్ ఆఫ్ హెర్బల్ మెడిసిన్‌లో ప్రచురితమైది.

ముప్పు ఏమిటి?

ప్రజలు విరివిగా వాడే 170 రకాల మూలికా ఔషధాల నమూనాలను హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు రిటైల్ మందుల షాపుల నుంచి సేకరించి అధ్యయనం చేశారు. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ బ్యాక్టీరియల్ అనలిటికల్ మాన్యువల్ సూచించిన ప్రామాణిక పద్ధతుల్లో మైక్రోబయలాజికల్ రిస్క్ అసెస్‌మెంట్ చేశారు. ఈ ఔషధాలు రోజుకు ఎంత మేరకు జబ్బును కలిగిస్తాయో తెలుసుకోవడానికి రిస్క్ రేంజర్ టూల్‌ను వినియోగించారు.

ముప్పు ఎందుకు?

ఈ మూలికా ఔషధాల్లో ఎస్చెరిచియా కోలి, ఫీకల్ కోలిఫామ్స్, స్టెఫిలోకాకస్, సూడోమోనాస్, సాల్మొనెల్లా, ఈస్ట్, మౌల్డ్ తదితర సూక్ష్మ క్రిములు యూఎస్ ఫార్మకోపియా అనుమతించే పరిమితులకు మించిన స్థాయిలో కనిపించాయి. 170 మూలికా ఔషధాలపై ఎఫ్‌డీఏ ప్రమాణాల ప్రకారం పరీక్షలు చేస్తే అందులో 52.4% ఔషధ నమూనాల్లో అధిక స్థాయిలో సూక్ష్మక్రిములు ఉన్నట్లు వెల్లడైంది. 110 ఘన రూపంలో ఉన్న నమూనాలను పరీక్షిస్తే వీటిలో 63.6% ఔషధ నమూనాల్లో ప్రమాణాలకు మించి సూక్ష్మక్రిములు ఉన్నాయి.

ఎంత ముప్పు?

కలుషిత మూలికా ఔషధాలను వాడే విని యోగదారుల ఆరోగ్యానికి ఎంత మేరకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది? అనే అంశాన్ని రిస్క్ రేంజర్ టూల్ ద్వారా శాస్త్రవేత్తలు అంచనా కట్టారు. ఈ సూక్ష్మక్రిములతో కూడిన మూలికా ఔషధాలను తీసుకునే వారు జీర్ణకోశ వ్యాధులు, తీవ్రమైన ఇన్ఫెక్షన్ల బారిన పడే ముప్పు ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

కింకర్తవ్యం?!

ఈ అధ్యయనం ద్వారా వెల్లడైన గణాంకాల ఆధారంగా మన దేశంలో మూలికా ఔషధాల తయారీ, నిల్వ పద్ధతులకు సంబంధించి కఠినమైన నాణ్యతా ప్రమాణాలను రూపొందించే ఆస్కారం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## మత్స్యకారులు అత్యంత ఇష్టంగా తినే చేపలు ఇవే..!



పులస నుండి ట్యూనా వరకు మత్స్యకారులు ఎన్నో రకాల చేపలు పడుతుంటారు. మరి అన్ని చేపలు పట్టే మత్స్యకారులు అత్యంత ఇష్టంగా తినే టేస్టీ, హెల్దీ చేప ఏంటో మీకు తెలుసా? అదే జెర్రీ చేప. ఈ పోషకాల ఘని గురించి మీకోసం. ఇవి పొడవుగా, పెద్దగా ఉంటూ చిన్న చేపలను వేటాడి తింటాయి. ఈ చేప అత్యధిక పోషకాలతో పాటు అత్యంత రుచిగా కూడా ఉంటుంది. అందుకే చేపలు ఇష్టపడే వారు, మత్స్యకారులకు ఇష్టమైన చేపల్లో ఒకటిగా ఈ జెర్రీ చేపను పిలుస్తారు. ఈ జెర్రీ చేప దంతాలు చాల పదునుగా ఉంటాయి. లేత తెలుపు రంగులో సన్నగా ఉండి పొడవాటి శరీరాన్ని కలిగి ఉంటుంది. ఈ చేపకు కింద దవడ పొడవుగా ఉంటుంది. సూదిగా ఉండే నోటి భాగాన్ని కలిగి ఉంటుంది. దీంతో వేటాడేందుకు అనుకూలంగా ఉంటుంది. ఈ చేపలు ప్రధానంగా హిందూ మహాసముద్రం పరిధిలోని తీర ప్రాంతాల్లో అధికంగా కనిపిస్తాయి. సముద్రరొయ్యలు, కీటకాలు, చిన్న చేపలను వేటాడి తింటాయి. ఇవి ఉష్ణ మండల ప్రాంత సముద్రాలలో ఎక్కువగా లభిస్తాయి. ఈ జెర్రీ చేపలు అన్ని సీజన్లలోనూ దొరుకుతాయి. ఆహారం కోసం రాత్రులు నీటి ఉపరితలానికి దగ్గరగా వస్తాయి. అప్పుడు సులువుగా మత్స్యకారులు వీటిని పట్టుకుంటారు. ఇకపోతే, డిమాండ్ ని బట్టి జెర్రీ చేప ధర ఉంటుంది. మాములుగా కిలో 300 రూపాయిలు గా ఉంటుంది. డిమాండ్ బట్టి 400 రూపాయల వరకు పలుకుతుంది. దీని రుచి కారణంగా ధర చూడకుండా ప్రజలు కనుగోలు చేస్తున్నారు. ఈ జెర్రీ చేప రుచి తో పాటు అధిక పోషకాలు ఉంటాయి. దీనిలో అధికంగా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్నాయి. ఇది గుండె ఆరోగ్యంగా ఉండడానికి సహాయం చేస్తుంది. శారీరక ఆరోగ్యం కూడా మెరుగవుతుంది.

## తేనె, మిరియాల పొడిని రోజూ తినండి.. అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు..



తేనె, మిరియాలను మనం తరచూ అనేక ఆహారాల్లో ఉపయోగిస్తుంటాం. మిరియాలను రసం లేదా చారు, ఇతర వంటకాల్లో వేస్తుంటారు. తేనెను కూడా తరచూ ఉపయోగిస్తుంటారు. అయితే మీకు తెలుసా.. ఆయుర్వేద ప్రకారం ఈ రెండింటి కాంబినేషన్ చాలా శక్తివంతమైంది. ఇది అనేక వ్యాధులను తగ్గిస్తుంది. తేనె, మిరియాల పొడి కాంబినేషన్‌ను రోజూ ఉదయం, సాయంత్రం 2 సార్లు 1 టీస్పూన్ చొప్పున తీసుకోవాలని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఒక టీస్పూన్ తేనెలో పావు టీస్పూన్ మిరియాల పొడిని కలపాలి. ఇలా రోజుకు 2 సార్లు తీసుకోవాలి. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా తేనె, మిరియాల పొడి వేసి బాగా కలిపి ఆ నీళ్లను అయినా తాగవచ్చు. ఇలా తేనె, మిరియాల పొడిని కలిపి రోజూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు.

**సీజనల్ వ్యాధులకు చెక్..**

తేనె, మిరియాల పొడి మిశ్రమాన్ని తీసుకుంటే సహజసిద్ధమైన డిమల్సెంట్‌గా పనిచేస్తుంది. ఇది గొంతు సమస్యలను తగ్గిస్తుంది. గొంతులో ఉండే గరగర, నొప్పి, మంట వంటి సమస్యలు తగ్గిపోతాయి. అలాగే ఈ మిశ్రమం ఎక్స్‌పెక్టొరెంట్‌గా కూడా పనిచేస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దీంతో దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడి, తేనె మిశ్రమాన్ని తీసుకుంటే జీర్ణాశయంలో పలు ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. హైడ్రోక్లోరిక్ యాసిడ్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఈ మిశ్రమం ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. అందువల్ల దీన్ని తింటే జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి.

**బరువు తగ్గేందుకు..**

తేనె, మిరియాల పొడి మిశ్రమాన్ని తీసుకుంటే బరువు తగ్గుతారు. ఇందులో పైపరైన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో కొవ్వు కణాలు కరిగిపోతాయి. ఈ మిశ్రమాన్ని రోజుకు 2 సార్లు తినడం వల్ల శరీరంలో అధికంగా ఉండే కొవ్వు కరిగిపోతుంది. బరువు తగ్గుతారు. సన్నగా నాజూగ్గా మారుతారు. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం తగ్గుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. తేనె, మిరియాల పొడి మిశ్రమంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించి ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. ఈ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. అందువల్ల వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

## క్యారెట్ జ్యూస్‌ను అసలు రోజూ ఎంత తాగాలి..? ఏ సమయంలో తాగితే మంచిది..?



మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల కూరగాయల్లో క్యారెట్లు కూడా ఒకటి. వీటిని చాలా మంది తరచూ ఉపయోగిస్తుంటారు. క్యారెట్లను నేరుగా అలాగే తినవచ్చు. లేదా కూరల్లో వేసి వండుకుని తినవచ్చు. అయితే క్యారెట్లను రోజూ తినడం కష్టంగా ఉందని భావించేవారు వీటితో జ్యూస్ తయారు చేసి నిల్వ చేసుకుంటే దాన్ని రోజూ కొద్ది మొత్తంలో తాగవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను రోజుకు 120 ఎంఎల్ మోతాదులో తాగితే చాలు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. ఇక పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం క్యారెట్ జ్యూస్‌ను ఉదయం పరగడుపునే సేవించాలి. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ జ్యూస్ మనకు ఎంతగానో మేలు చేస్తుందని అంటున్నారు.

**కళ్ల ఆరోగ్యానికి..**

క్యారెట్లలో బీటా కెరోటిన్, లుటీన్, జియాజాంతిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కళ్లకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. వృద్ధాప్యం కారణంగా కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకుంటాయి. దీంతో కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. క్యారెట్ లలో విటమిన్ సి, ఎ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో శరీరం ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు. జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**చర్మ సంరక్షణకు..**

క్యారెట్ జ్యూస్‌ను తాగడం వల్ల అందులో ఉండే బీటా కెరోటిన్ చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. సూర్యకాంతి వల్ల చర్మానికి జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో చర్మం సహజసిద్ధంగా కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. క్యారెట్లలో ఉండే విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు తగ్గిపోతాయి. క్యారెట్ జ్యూస్‌లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తుంది. ఈ జ్యూస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. ఫలితంగా గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

**క్యాన్సర్ రాకుండా..**

క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీంతో పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను ఉదయం సేవిస్తేనే అధిక ప్రయోజనం ఉంటుందని, ఆ సమయంలో క్యారెట్ జ్యూస్‌ను తాగితే అందులో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. క్యారెట్ జ్యూస్ ను ఉదయం తాగడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరిగి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. క్యారెట్ జ్యూస్ తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అందులో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఇలా క్యారెట్ జ్యూస్ ను రోజూ తాగడం వల్ల అనేక లాభాలను

బిజినెస్ వాయిస్

# రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్

## గృహ రుణాలపై పావు శాతం వడ్డీ పెంపు

**న్యూఢిల్లీ :** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. నూతనంగా గృహ రుణాలను తీసుకునేవారికి అధికం భారం మోపుతున్నది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రుణ గ్రహీతల జేబులకు మరిన్ని చిల్లులు పడబోతున్నాయి. ప్రస్తుతం బ్యాంక్ గృహ రుణాలపై %×త్వతీవర్ తీఫ్వ%7.50 శాతం నుంచి 8.70 శాతంగా ఆఫర్ చేస్తున్నది. గతంలో 7.50 శాతం నుంచి 8.45 శాతంగా ఉన్నది. తక్కువ సిబిల్ స్కోర్ ఉండేవారికి అధిక వడ్డీరేటుకు గృహ రుణాన్ని అందించనున్నది. ఈ వడ్డీరేట్ల పెంపు కొత్తగా తీసుకునే రుణాలకు మాత్రమే వర్తించనున్నదని, పాత వాటికి వర్తించదని బ్యాంక్ స్పష్టంచేసింది.

**ఆర్బీఐ వడ్డించకపోయినప్పటికీ**

రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఎస్బీఐ మాత్రం వడ్డీరేట్లను పెంచడం విశేషం. రెపోరేటును 5.55 శాతంగా ఉంచిన విషయం తెలిసిందే. ఎస్బీఐ తీసుకున్న నిర్ణయంతో ఇతర బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ కలిగిన గృహ రుణంపై వడ్డీరేటు 7.75 శాతం నుంచి 8.95 శాతంగా వసూలు చేస్తున్నది. అలాగే టాప్-అప్ రుణాలపై బ్యాంక్ 8 శాతం నుంచి 10.75 శాతం చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నది. ఉదాహరణకు 20 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకునేవారు 8.45 శాతం వార్షిక వడ్డీతో రూ.25,830 ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వడ్డీరేటు 8.70 శాతానికి పెంచడంతో




ఈఎంఐ రూ.26,278కి చెల్లించాల్సివుంటుంది. అంటే నెలకు రూ.450 అదనంగా చెల్లించాల్సివుంటుంది. అంటే మొత్తం గృహ రుణంపై లక్ష రూపాయలు చెల్లించాలి. తక్కువ స్థాయి రుణాలతోపాటు రూ.50 లక్షలకు పైగా రుణాలు తీసుకున్నవారికి కూడా భారం పడనున్నది.

**యూనియన్ బ్యాంక్ కూడా..**

మరో ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ కూడా గృహ రుణాలపై వడ్డీరేటును పది బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో గతంలో 7.35 శాతంగా ఉన్న గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతానికి ఎగబాకింది.

**ఎంసీఎల్ఆర్‌ని తగ్గించిన పలు బ్యాంకులు**

ఎస్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఒకవైపు గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్..మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండింగ్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో ఒక్కరోజు, నెల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 7.95 శాతం నుంచి 7.90 శాతానికి దించింది. అలాగే నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.8 శాతం నుంచి 8.75 శాతానికి దించిన బ్యాంక్..రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటును 8.85 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గించింది. ఎస్బీఐతోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) కూడా ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. దీంట్లో బీవోబీ ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.3 శాతం నుంచి 7.95 శాతానికి దించిన బ్యాంక్..ఆరు నెలల రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.65 శాతానికి, ఏడాది రుణాలపై రేటును 8.8 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 8.9 శాతంగా ఉన్నది. అలాగే ఒక్కరోజు, మూడు నెలల రుణాలపై రేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రుణ రేటు 7.95 శాతానికి దిగొచ్చింది. దీంతోపాటు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఏడాది రుణాలపై వడ్డీరేటును 8.9 శాతానికి, ఆరు నెలల రుణాలపై రేటును 8.70 శాతానికి తగ్గించింది. జఅలాగే నెల రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 8.3 శాతానికి, మూడు నెలల రుణాలపై రేటును 8.45 శాతానికి తగ్గించింది. మరో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు కోత పెట్టడంతో వడ్డీరేటు 8.90 శాతానికి తగ్గింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ మధ్యకాలంలో రిజర్వుబ్యాంక్ రెపోరేటును 100 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో ఈ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు అందించాలనే ఉద్దేశంతో బ్యాంకులు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

## యమహా నయా స్కూటర్..
## గరిష్ఠ ధర రూ.1.02 లక్షలు



**చెన్నై, ఆగస్టు 16:** యమహా దేశీయ మార్కెట్లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభించనున్నది. ఫాస్కినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్‌ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్ ఫీచర్స్, ట్కస్టైలిష్ లుక్‌తో తయారు చేసింది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.79,340 నుంచి రూ.1,02,790 ధరల్లో లభించనున్నాయి. స్మార్ట్ మోటర్ జనరేటర్ టెక్నాలజీ, సైలెంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

## తగ్గనున్న బీమా ప్రీమియం!..
## జీఎస్టీని తగ్గించేయోచనలో కేంద్రం




**న్యూఢిల్లీ :** జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయం సామాన్యులకు సైతం భారీ ఊరట లభించబోతున్నది. ఈ నిర్ణయంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనుండటంతోపాటు బీమా పాలసీల ధరలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న నరేంద్ర మోదీ సర్కార్..దీనిని 5 శాతానికి కుదించేయోచనలో ఉన్నది. దీంతో ఈ రెండు రకాల పాలసీలు తీసుకున్నవారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగడంతోపాటు బీమా ప్రీమియం చెల్లింపులు తగ్గనున్నాయి. బీమా ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి సూచించిన విషయం తెలిసిందే. 2047 నాటికి భారతీయులందరికి బీమా ఉండాలనే నినాదంతో ముందుకు సాగుతున్న ఐఆర్‌డీఏఐ..ఈ జీఎస్టీ తగ్గింపు కొంతలో కొంత మేలు చేయనున్నది. బీమా ప్రీమియంపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని సూచించింది.

**తగ్గిన బీమా వినిమయం**

బీమా పరిధిని మరింత విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు చేస్తున్న ప్రయోజనాలు బెడిసికొడుతున్నాయి. గతంలో నాలుగు శాతంగా ఉన్న బీమా వినిమయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.7 శాతానికి పరిమితమైంది. దీంట్లో నాన్-లైఫ్ వినిమయం ఒక్క శాతంగా ఉండగా, లైఫ్ ఇన్సూరెన్స్‌లు 3 శాతంగా నమోదయ్యాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2, 101 కోట్ల జీఎస్టీని వసూలు చేసిన బీమా సంస్థలు..2023-24 నాటికి రూ.16,398 కోట్ల ఆదాయాన్ని వసూలు చేశాయి.

# గూగుల్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు: సుందర్ పిచాయ్

ఒకప్పుడు ఇంటర్వ్యూ అంటే.. ముఖాముఖి నిర్వహించేవాళ్ళు. టెక్నాలజీ పెరిగిన తరువాత వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేయడం మొదలైంది. ఈ విధానం ద్వారా ఇంటర్వ్యూలు జరిపితే.. కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి వర్చువల్ విధానంలో జరిగే ఇంటర్వ్యూలపై గూగుల్ సీఈఓ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటే అభ్యర్థులు కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికే గూగుల్ కంపెనీలో మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు 'సుందర్ పిచాయ్' పేర్కొన్నారు. ఏఐ వినియోగం పెరుగుతున్నందున వర్చువల్ ఇంటర్వ్యూలు సమంజసం కాదని కంపెనీలోని ఉద్యోగులు కూడా డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. వర్చువల్ ఇంటర్వ్యూల ద్వారా.. ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడం సులభం. అంతే కాకుండా శ్రమ, వ్యయం కూడా తగ్గుతాయి. అయితే కొందరు మోసం చేయడం మొదలు పెట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకునే.. ఇంటర్వ్యూ చేయదలచిన అభ్యర్థిని, కనీసం ఒక్కసారైనా వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ సమస్య ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో గూగుల్ మాత్రమే కాకుండా.. అమెజాన్, ఆంత్రోపిక్ , సిస్కో, మెకిన్సే వంటి కంపెనీలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులను చూస్తుంటే.. కంపెనీలన్నీ వర్చువల్ ఇంటర్వ్యూ విధానానికి మెల్లగా చరమగీతం పాడేసి, మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలకే ప్రాధాన్యత




ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది.

# బరిలో బుమ్రా!.. ఆసియాకప్ టోర్నీ

## ఆసియాకప్ టోర్నీకి అందుబాటులో
## శ్రేయాస్, జితేశ్‌కు అవకాశం

ముంబై: ఆసియా కప్ టోర్నీకి భారత జట్టు ఎంపికపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మొదలయ్యే ఆసియా కప్ కోసం మంగళవారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ జట్టును ఎంపిక చేయనుంది. అయితే గాయాలతో సహవాసం చేస్తున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఆసియా కప్ టోర్నీకి అందుబాటులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీన్ని మరింత బలపరుస్తూ టోర్నీకి అందుబాటులో ఉండబోతున్నట్లు సెలెక్టర్లకు సమాచారమిచ్చినట్టు జాతీయ వార్తా సంస్థలు తమ కథనాల్లో ప్రముఖంగా పేర్కొన్నాయి. దీంతో వెస్టిండీస్ వేదికగా ముగిసిన టీ20 ప్రపంచకప్ టోర్నీ తర్వాత బుమ్రా మళ్లీ టీమ్‌ఇండియా తరఫున టీ20లు ఆడనున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన అండర్సన్-టెండూల్కర్ టెస్టు సిరీస్‌లో ముందుగా అనుకున్నట్లుగానే ఐదు మ్యాచ్‌ల్లో మూడింటికే పరిమితమైన బుమ్రా.. ఆసియా కప్‌లో బరిలోకి దిగితే భారత్ పేస్ దళం మరింత పదునెక్కే అవకాశముంది. ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుంటున్న సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ లేని లోటును బుమ్రాతో పూడ్చేందుకు సెలెక్టర్లకు ఇది మంచి అవకాశం. దీనికి తోడు కీలక సమయాల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేయడంలో ముందుండే బుమ్రా జట్టులో ఉండటం అదనపు బలం కానుంది. భవిష్యత్ సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని బుమ్రాను సెలెక్టివ్‌గా ఆడిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్ అందుకు తగ్గట్లు నిర్ణయం తీసుకునే చాన్స్ ఉంది. టీ20ల్లో ప్రస్తుతం అర్ష్‌దీప్‌సింగ్ ప్రధాన బౌలర్‌గా కొనసాగుతుండగా, హర్షిత్




రానా కీలకంగా ఉన్నాడు. ఇదిలా ఉంటే ఇటీవలి ఐపీఎల్ ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్‌తో పాటు ప్రసిద్ధ్ కృష్ణ బెర్తులు దక్కించుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. మొత్తంగా స్లో పిచ్‌లకు చిరునామా అయిన యూఏఈలో బౌలింగ్ కాంబినేషన్‌పై ఆసక్తి నెలకొన్నది.

**శ్రేయాస్, జితేశ్‌కు చాన్స్:**

ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన శ్రేయాస్ అయ్యర్, జితేశ్‌శర్మ తిరిగి టీమ్‌ఇండియా టీ20 జట్టులోకి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టును అయ్యర్ ముందుండి నడిపిస్తే లోయార్డర్‌లో ధనాధన్ బ్యాటింగ్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) 18 ఏండ్లలో తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలువడంలో జితేశ్ కీలకంగా వ్యవహరించాడు. ఒకవేళ వీళ్ల ఇద్దరిని టీమ్‌కు ఎంపిక చేస్తే అదే సమయంలో ఆల్‌రౌండర్ శివమ్‌దూబే, హార్డ్‌హిట్టర్ రింకూసింగ్‌ను పక్కకు తప్పించాల్సి ఉంటుంది. స్పిన్ బౌలింగ్‌లో ధాటిగా ఆడటంలో దిట్ట అయిన శివమ్ దూబేతో శ్రేయాస్‌కు పోటీ నెలకొన్నది. తనదైన రోజున ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో దూకుడుగా ఆడటంలో శ్రేయాస్ ముందంజలో ఉంటాడు. మరోవైపు సంజూ శాంసన్‌కు రిజర్వ్ వికెట్‌కీపర్‌గా వ్యవహరిస్తున్న ధృవ్‌జురెల్‌ను తప్పించి అతని స్థానంలో జితేశ్‌ను తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలకమైన లోయార్డర్‌లో ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి దూకుడుగా ఆడటంలో జురెల్ కంటే జితేశ్ ఒకింత ముందున్నాడు.

**గిల్, జైస్వాల్ వచ్చేనా!**

శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ టీ20 టీమ్‌లోకి రావడంపై సందిగ్ధత నెలకొన్నది. ఈ మధ్యే ఇంగ్లండ్‌తో ముగిసిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మెరుగ్గా రాణించిన గిల్, జైస్వాల్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఒకవేళ ఆసియా కప్ టీమ్‌కు గిల్, జైస్వాల్‌ను పరిగణనలోకి తీసుకుంటే కొద్ది రోజుల తేడాతో స్వదేశం వేదికగా వెస్టిండీస్‌తో మొదలయ్యే టెస్టు సిరీస్‌కు ఎక్కువ సమయం దొరకకపోవచ్చు. సెప్టెంబర్ 28తో ఆసియా కప్ ముగుస్తుండగా, అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో విండీస్‌తో తొలి టెస్టు మొదలుకానుంది. ఈ నేపథ్యంలో రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని టెస్టు టీమ్‌లో కీలకమైన గిల్, జైస్వాల్‌ను ఆసియా కప్‌నకు ఎంపిక చేయకపోవచ్చనే వార్తలు వెలువడుతున్నాయి. మొత్తంగా మంగళవారం జరిగే సెలెక్షన్ కమిటీ సమావేశం ద్వారా వీటన్నింటికి సమాధానం దొరకనుంది. చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ పగ్గాలు చేపట్టిన తర్వాత జరిగిన 15 టీ20ల్లో టీమ్‌ఇండియా 13 విజయాలు సొంతం చేసుకుంది. దీనికి తోడు వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనున్న క్రమంలో ప్రస్తుత కోర్‌టీమ్‌లో భారీ మార్పులు ఉండకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆసియాకప్‌లో టీమిండియాపై
## విజయం మాదే: పాక్ క్రికెట్ డైరెక్టర్



ఆసియాకప్-2025 కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తొలి అడుగు వేసింది. ఈ మెగా టోర్నీకి 17 మంది సభ్యులతో కూడిన జట్టును పీసీబీ ప్రకటించింది. ఈ జట్టు కెప్టెన్‌గా సల్మాన్ అలీ అఘా ఎంపికయ్యాడు. అదేవిధంగా స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్‌లపై సెలక్టర్లు వేటు వేశారు. అయితే జట్టు ప్రకటన అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్న పాకిస్తాన్ క్రికెట్ జట్టు హై-పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావేద్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆసియాకప్‌లో భారత జట్టును ఓడించే సత్తా పాక్‌కు ఉందని జావేద్ అభిప్రాయపడ్డాడు. జట్టులోని ప్రతీ ఆటగాడు టీమిండియా విసిరే సవాల్‌కు సిద్ధంగా ఉన్నారని ఈ పాక్ మాజీ పేసర్ తెలిపాడు. కాగా పాకిస్తాన్‌పై టీ20ల్లో భారత్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. కానీ పాక్ జట్టు మాత్రం ఆసియా కప్-2022లో విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు ఇరు జట్లు 13 మ్యాచ్‌లలో ముఖాముఖి తలపడగా.. భారత్ తొమ్మిది మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, పాకిస్తాన్ మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. పాక్ చివరగా దుబాయ్‌లో జరిగిన 2022 ఆసియా కప్ సూపర్ ఫోర్‌లో భారత్‌పై టీ20 విజయం సాధించింది. "పాకిస్తాన్ టీ20 జట్టు టీమిండియాను ఓడించగలదు. భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటే భారీ అంచనాలు ఉంటాయి. కానీ మేము ఎంపిక చేసిన ఈ 17 మంది సభ్యుల జట్టు ఏ టీమ్‌నైనా ఓడించగలదు. అయితే వారిపై మేము ఎటువంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. ఈ జట్టుపై నాకు చాలా నమ్మకం ఉంది.

క్రీడా వాయిస్

## ఆసియాకప్ రేసులో గిల్ కంటే అతడే ముందున్నాడు: అశ్విన్




ఆసియాకప్-2025 టీ20 టోర్నీ సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ప్రారంభం కానుంది. ఈ మార్క్యూ ఈవెంట్ కోసం భారత జట్టును అజిత్ అగర్కార్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముంది. అయితే ఈ టోర్నీకి భారత జట్టులో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు ఇవ్వాలని లెజెండరీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ సూచించాడు. కాగా టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక టీ20 ఫార్మాట్‌లో ఓపెనర్లగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ కొనసాగుతున్నారు. చాలా టీ20 మ్యాచ్‌లకు జైశ్వాల్‌కు విశ్రాంతి ఇచ్చారు. ఇప్పుడు ఆసియాకప్‌నకు జైశ్వాల్‌తో పాటు మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ కూడా ఉన్నాడు. దీంతో భారత జట్టులో ఎవరికి చోటు దక్కుతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. "ఆసియాకప్ జట్టు ఎంపిక గురించి కొన్ని చర్చలు జరుగుతున్నాయి. టీ20 ప్రపంచకప్‌లో యశస్వి జైస్వాల్ బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నందున, శుబ్‌మన్ గిల్‌ను టీ20 ప్రణాళికలకు సరిపోతాడా లేదా అన్నది ఇప్పుడు అందరి మనస్సులను తొలుస్తున్న ప్రశ్న. నావరకు అయితే సెలక్టర్లు గిల్ కంటే జైశ్వాల్‌కే తొలి ప్రధాన్యత ఇస్తారని అనుకుంటున్నాను. రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆ స్దానంలో జైశ్వాల్ ఆటోమేటిక్‌గా లభిస్తుంది. అభిషేక్ శర్మ స్దానానికి ఎటువంటి ఢోకా లేదు. ఇప్పుడంతా మరో ఓపెనర్ కోసమే చర్చ. శుబ్‌మన్ గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అదేవిధంగా సంజూ శాంసన్ కూడా ఓపెనర్‌గా అద్భుతంగా రాణించాడు. కాబట్టి సెలెక్టర్లకు కష్టమైన పరిస్థితి" అని ఎక్స్‌ప్రెస్ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ పేర్కొన్నాడు.

# ఆఫీస్కు సన్నీ లియోన్.. ఫొటోలో అసభ్యకరంగా..



బాలీవుడ్ నటి సన్నీలియోన్ గురించి అందరికీ తెలిసిందే. తక్కువ టైమ్ లోనే ఎక్కువ పాపులారిటీ సొంతమైంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో మోడలింగ్ చేసిన ఆమె.. ఆ తర్వాత సినిమాలకు పరిమితమైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో వరుస ఆఫర్స్ దక్కించుకుంటున్న బ్యూటీ.. పాన్ ఇండియా హీరోయిన్ గా మారింది. తన అందచందాలతో మెప్పిస్తుంది. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్ లో నటించి పాపులర్ అయిన ముద్దుగుమ్మ.. తెలుగులో కూడా సందడి చేసింది. ఇప్పటికే పలు సాంగ్స్ లో కనిపించి ఆకట్టుకుంది. కరెంట్ తీగ, గరుడ వేగ వంటి పలు సినిమాలతో మెప్పించిన అమ్మడు.. ఇప్పుడు త్రిముఖలో మరో ఐటెం సాంగ్ లో కనపడనుంది సన్నీలియోన్. సాహితీ దాసరి, ఆకృతి అగర్వాల్ తో కలిసి గిప్పా గిప్పా పాటలో కనువిందు చేయనుండడం పక్కా. మొత్తానికి ఎక్కడ అవకాశాలు ఉంటే అక్కడ వాలిపోతూ సక్సెస్ అందుకుంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా సన్నీ లియోన్ ఫుల్ యాక్టివ్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తూ.. తన అంద చందాలు ఆరబోస్తూ.. సందడి చేస్తుంటుంది. క్రేజీ ఔట్ ఫిట్స్ వేసుకుంటూ గ్లామర్ తో మైమరిపించడం సన్నీకి వెన్నతో పెట్టిన విద్య అనుకోవాలి. సన్నీ లియోన్ కు తన ఫ్యాషన్ ఎంపికలతో అందరి దృష్టి ఎలా ఆకర్షించాలో బాగా తెలుసని చెప్పాలి. ఆమె కేవలం గ్లిట్జ్, గ్లామర్ తోనే కాకుండా.. తన బబ్లీ నెస్, వినయపూర్వకమైన వ్యక్తిత్వంతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది. అయితే తాజాగా వీడియో పోస్ట్ చేసింది. ఈరోజు ఆఫీసులోకి అడుగుపెట్టినప్పుడు చూసిన దాన్ని మీరు నమ్మలేరంటూ రాసుకొచ్చింది. ఆ వీడియోలో ఆమె ఆఫీస్ కు వెళ్తుండగా.. ఎడిటర్ ఓ ఫోటోను ఎడిట్ చేస్తుంటారు. పిక్ ను జూమ్ చేసి చూస్తుంటారు. ఆ సమయంలో వెనక నుంచి వీడియో తీసి పోస్ట్ చేసింది సన్నీ లియోన్. ఎవరూ దాన్ని నమ్మలేరని తెలిపింది. షాక్ అయినట్లు ఎక్స్ప్రెషన్ ఇచ్చింది. ఇప్పుడు ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెటిజన్లు, అభిమానులు తెగ రెస్పాండ్ అవుతున్నారు. రకరకాలుగా కామెంట్స్ పెడుతున్నారు.

# రష్మిక సోలో కాదు.. విజయ్ తోనే..

స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఎప్పటికప్పుడు వెకేషన్స్ కు వెళ్తూ ఫుల్ చిల్ అవుతుంటారన్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఎప్పటికప్పుడు వెకేషన్స్ కు వెళ్తూ ఫుల్ చిల్ అవుతుంటారన్న విషయం తెలిసిందే. చేతి నిండా సినిమాలు ఉన్నా.. క్షణం తీరిక లేకుండా షూటింగ్స్ లో పాల్గొంటున్నా.. చిన్న గ్యాప్ వచ్చినా వెకేషన్స్ కు వెళు ంటారు. ఎప్పటికప్పుడు ఆమె ఎయిర్ పోర్ట్ కు వచ్చిన/ వెళ్లిన విజువల్స్ వైరల్ అవుతుంటాయి. అదే సమయంలో రష్మిక ఎయిర్ పోర్ట్ లో కనిపించిన కాసేపటికే స్టార్ హీరో విజయ్ దేవరకొండ కనిపిస్తుంటారు. ఇద్దరూ కలిసి వెళ్తారో.. లేక అక్కడ వెళ్లాక కలుస్తారో తెలియదు. కానీ వెంట వెంటనే ఎయిర్ పోర్ట్ లో దర్శనమిస్తుంటారు. అయితే రీసెంట్ గా ఫారిన్ వెళ్లారు రష్మిక. ఆ తర్వాత విజయ్ మాత్రం కనిపించలేదు. - సగం సైకాలాజికల్ గా..మరో సగం చుట్టాలు చంపేస్తారు! ఎందుకోనని అంతా ఆలోచిస్తే.. ఆయన రీసెంట్ గా ఓ కేసు విచారణ నేపథ్యంలో ఈడీ అధికారుల ముందు హాజరయ్యారు. దీంతో రష్మిక సింగిల్ గానే వెళ్లారు. అయితే వెళ్లడం ఒక్కరే గానీ.. ఇప్పుడు విజయ్ ను కలిసినట్లు తెలుస్తోంది. ఎందుకంటే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తాజాగా అమెరికాలో దర్శనమిచ్చారు. అమెరికాలోని న్యూయార్క్ లో జరగనున్న ఇండియా డే పరేడ్ లో పాల్గొనున్నారు. కో- గ్రాండ్ మార్షల్స్ గా వ్యవహరించనున్నారు. ఆ విషయాన్ని ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్- ఎఫ్ఐఏ నిర్ధారించినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు విజయ్.. రష్మికను కలవడానికి చాలా చిన్న గ్యాప్ మాత్రమే ఇచ్చారని చెప్పాలి. - ఏంటీ.. నాగార్జున ఆ హోటల్ లో క్లీనింగి పని చేశారా? అదే సమయంలో విజయ్, రష్మిక డేటింగ్ లో ఉన్నారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. దానిపై వారు అఫీషియల్ గా అనౌన్స్ చేయనప్పటికీ.. అంతా ఫిక్స్ అయిపోయారు. ఎందుకంటే విజయ్, రష్మిక పరోక్షంగా వెల్లడిస్తూనే ఉన్నారు. తామిద్దరం రిలేషన్ లో ఉన్నామని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే..



రీసెంట్ గా కింగ్ డమ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు విజయ్. స్పై జోనర్ లో అన్నదమ్ముల కథతో రూపొందించిన ఆ సినిమాతో మెప్పించారు. అదే సమయంలో రష్మిక ఇటీవల కుబేర మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను అందుకున్నారు. ఇప్పుడు అనేక సినిమాల్లో నటిస్తున్నారు. వరుసగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

# 'నాకు అస్సలు వద్దు!'..



ట్యాగ్ పూర్తిగా తీసేసిన స్టార్ హీరోయిన్ అయితే కెరీర్ స్టార్టింగ్ నుంచి మంచి ఫేమ్ తో పాటు సాలిడ్ మార్కెట్ ను సంపాదించుకున్న వారిలో కోలీవుడ్ హీరోయిన్ నయనతార కూడా ఒకరన్న విషయం తెలిసిందే సౌత్ లో ఇప్పటికే స్టార్ హీరోయిన్స్ ఎంతో మంది ఉన్నారు. అయితే కెరీర్ స్టార్టింగ్ నుంచి మంచి ఫేమ్ తో పాటు సాలిడ్ మార్కెట్ ను సంపాదించుకున్న వారిలో కోలీవుడ్ హీరోయిన్ నయనతార కూడా ఒకరన్న విషయం తెలిసిందే. తనకంటూ ప్రత్యేక గుర్తింపు, ఫ్యాన్స్ సొంతం చేసుకున్న ఆమె.. ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటారు. అయితే రజినీకాంత్ ను కోలీవుడ్ సూపర్ స్టార్ అని అంతా పిలుస్తుండగా.. నయన్ ను లేడీ సూపర్ స్టార్ అని పిలుచుకునేవారు. కానీ కొన్ని నెలల క్రితం నయనతార ప్రెస్ నోట్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తనకు ఆ ట్యాగ్ వద్దు అనుకుంటున్నట్లుగా నోట్ లో చెప్పుకొచ్చారు. తనను నయనతార మాత్రమే అనాలని చెప్పారు. - సగం సైకాలాజికల్ గా..మరో సగం చుట్టాలు చంపేస్తారు! అభిమానులు, మీడియా ప్రతినిధులు, సినీ ప్రియులు అంతా నయనతార అనే పిలవాలని కోరారు. దీంతో అప్పట్లో ఆమె నిర్ణయంతో వైరల్ గా మారారు. సోషల్ మీడియాలో అన్ని వర్గాల ఆడియన్స్ ప్రశంసలు అందుకున్నారు. అయితే ఇప్పుడు ఆ విషయం మళ్ళీ నెట్టింట వైరల్ గా మారింది. పేరు ముందు ట్యాగ్ పూర్తిగా తీసుకున్నారు నయన్. నయన్ అప్ కమింగ్ మూవీస్ లో డియర్ స్టూడెంట్స్ కూడా ఒకటి. మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. లవ్ యాక్షన్ డ్రామా చిత్రం తర్వాత నయన, నివిన్ ఇప్పుడు మరోసారి జతకడుతున్నారు. అప్పుడు మంచి హిట్ అందుకోగా.. ఇప్పుడు కామెడీ డ్రామా డియర్ స్టూడెంట్స్ పై కూడా సూపర్ బజ్ నెలకొంది. - ఏంటీ.. నాగార్జున ఆ హోటల్ లో క్లీనింగి పని చేశారా? రీసెంట్ గా మేకర్స్ ఆ మూవీ టీజర్ రిలీజ్ చేశారు. అందులో టైటిల్ కార్డ్స్ లో నయన్ తార పేరుపై అందరూ ఫోకస్ చేశారు. చూడీదార్ డ్రెస్ లో ఉన్న హీరోయిన్ ను పరిచయం చేస్తూ.. నయనతార అనే వేశారు మేకర్స్. దీంతో ఇప్పటికే ప్రెస్ నోట్ ను రిలీజ్ చేసిన నయనతార అందుకు తగ్గట్లే ఫాలో అయ్యారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. డిసెషన్ తీసుకోవడమే కాదని.. ఫాలో అవ్వడం చాలా ముఖ్యమని కొందరు చెబుతున్నారు. అందుకు ఎగ్జాంపుల్ గా నయనతార ట్యాగ్ తీసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దీనిబట్టి చూస్తే నయన్ అప్ కమింగ్ అన్ని చిత్రాల్లో ఆమె పేరు ముందు ఇకపై ఎలాంటి ట్యాగ్ ఉండదని డియర్ స్టూడెంట్స్ మూవీ టీజర్ తో అందరికీ క్లారిటీ వచ్చేసినట్లే.

# తలుపులు తెరవబడ్డాయ్' బెల్లంకొండ కిష్కింధపురి టీజర్ చూశారా?




అదే సమయంలో ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన లుక్స్, గ్లింప్స్ వేరే లెవల్ లో ఉండి.. ఆడియన్స్ ను విపరీతంగా ఆకర్షించాయి. టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్.. ఇప్పుడు కిష్కింధపురి మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ మరోసారి శ్రీనివాస్ తో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ఇప్పటికే వీరి కాంబోలో వచ్చిన రాక్షసుడు మూవీ రాగా, ఇప్పుడు మరోసారి కిష్కింధపురితో సందడి చేయనున్నారు. మిస్టీరియస్ హారర్ థ్రిల్లర్ గా రూపొందుతున్న కిష్కింధపురిని చావు కబురు చల్లగా ఫేమ్ కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. మేకర్స్ సెప్టెంబర్ 12వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన లుక్స్, గ్లింప్స్ వేరే లెవల్ లో ఉండి.. ఆడియన్స్ ను విపరీతంగా ఆకర్షించాయి. ఇప్పుడు తాజాగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ప్రస్తుతం టీజర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సినీ ప్రియులను తెగ మెప్పిస్తోంది. హారర్ మ్యూజిక్ తో టీజర్ స్టార్ట్ అయింది. ఓ రూమ్ లో చిన్నపాప ఉండగా.. తలుపులు సౌండ్ చేస్తుంటాయి. ఆ తర్వాత చిన్నారి మిస్ అవుతుంది. అప్పుడే నమస్కారం.. ఈరోజు శుక్రవారం.. 9-8 -1989 ఆకాశవాణి తలుపులు తెరవబడ్డాయ్.. పునః ప్రసారాలు నేటితో మొదలవుతాయి అంటూ బ్యాక్ గ్రౌండ్ లో డైలాగ్ వస్తుంది. ఆ తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ సీరియల్ లుక్ లో కనిపిస్తారు. రహస్యాన్ని చేధించే వ్యక్తి రోల్ పోషిస్తున్నట్లు ఉన్నారు. అయితే టీజర్ లో పాత భవనం, భయానక స్థితిగతులు, మనిషి సజీవదహనవ్వడం, బస్సు కాలిపోవడం వంటి ఘటనలు చూపించారు మేకర్స్. తద్వారా సినిమా కోసం ఓ సరికొత్త ప్రపంచాన్ని డైరెక్టర్ సృష్టించినట్లు అర్థమవుతోంది చైతన్ భరద్వాజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విజువల్స్ కథాంశానికి కరెక్ట్ గా సరిపోయినట్లు అనిపిస్తోంది. సాహు గారపాటి నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. గ్రిప్పింగ్ హారర్ మిస్టరీగా రూపొందుతున్న సినిమా టీజర్ ఓవరాల్ గా గూస్ బంప్స్ తెప్పిస్తోందని చెప్పాలి. సినిమాపై అంచనాలు కూడా పెంచుతోంది. మరి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# చీర కట్టులో వింక్ బ్యూటీ అందం చూశారా?



మలయాళ సినిమా 'ఒరు అదార్ లవ్'తో ఒక్కసారిగా స్టార్డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్.మలయాళ సినిమా 'ఒరు అదార్ లవ్'తో ఒక్కసారిగా స్టార్డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు మోస్ట్ పాపులర్ కావడానికి ప్రధాన కారణం ఒరు అదార్ లవ్ లోని పాటలో ముద్దుగన్ పేల్చడం, కన్ను గీటడం అనే విషయం తెల్సిందే. ఓవర్ నైట్లో సోషల్ మీడియా సెన్సేషన్ అయిన ఈ వింక్ బ్యూటీ సినిమాల్లో వరుసగా నటించింది. మొదటి సినిమా ఒరు అదార్ లవ్ ఫ్లాప్ కాగా, ఆ తర్వాత సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. ఒకటి రెండు సినిమాలు కాస్త పర్వాలేదు అన్నట్లుగా నిలిచినా ఓవరాల్గా హీరోయిన్గా ప్రియా ప్రకాష్ వారియర్కి కచ్చితంగా తీవ్రంగా నిరాశను మిగిల్చాయి అనడంలో సందేహం లేదు. ఆమె నటిగా మరిన్ని సినిమాలు చేస్తుందా లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. లైనప్ బాగానే ఉంది.. మరి ఆ సినిమా పరిస్థితేంటి? స్కిన్ షో ఫోటోలతో వైరల్ ఓవర్ నైట్ స్టార్డం దక్కడంతో సోషల్ మీడియాలో మిలియన్ల కొద్ది ఫాలోవర్స్ను దక్కించుకున్నారు. దాదాపుగా 77 లక్షల మందిని ఫాలోవర్స్గా కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా స్కిన్ షో ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచే ఈ అమ్మడు అప్పుడప్పుడు చీర కట్టు ఫోటోల వల్ల వార్తల్లో నిలుస్తూ ఉంటుంది అనే విషయం తెల్సిందే. తాజాగా ఈమె ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చీర కట్టు ఫోటోల్లో ఈ అమ్మడి అందంకు ప్రతి ఒక్కరూ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయి అందంగా ఉన్న ప్రియా ప్రకాష్ వారియర్కి అదృష్టం కలిసి రావడం లేదని, అందుకే ఆఫర్లు పెద్దగా రావడం లేదని కొందరు అంటున్నారు. - 'తలుపులు తెరవబడ్డాయ్'.. బెల్లంకొండ కిష్కింధపురి టీజర్ చూశారా? ప్రియా ప్రకాష్ వారియర్ చీర కట్టు ఫోటోలు చేసిన చిన్నా చితకా సినిమాలు పెద్దగా కలిసి రావడం లేదు. అందుకే ప్రియా ప్రకాష్ వారియర్ ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఉన్న ఈఅమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఇలాంటి అందమైన చీర కట్టు ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. ఈసారి చీర కట్టులో కాస్త ఓల్డ్ గెటప్లో, ఏజ్ ఎక్కువ ఉన్న సాదారణ గృహిణి మాదిరిగా ప్రియా ప్రకాష్ ఫోటోలు ఉన్నాయి. అందమైన ప్రియా ప్రకాష్ వారియర్ ఇలా కూడా చాలా అందంగా ఉందని కొందరు అంటున్నారు. నడుము అందం చూపిస్తూ ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# హజీవనం, డేటింగ్ యాప్స్ పై కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు



బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. పెళ్లయిన పురుషులతో సంబంధాల విషయంలో సమాజం ఎప్పుడూ మహిళలనే దోషిగా చూస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... తన వ్యక్తిగత జీవితంపై వచ్చే విమర్శలతో పాటు, నేటితరం డేటింగ్ పోకడలపై కూడా ఘాటుగా స్పందించారు.కెరీర్లో రాణించాలనే తపన ఉన్న యువతులను పెళ్లయి, పిల్లలున్న పురుషులు తమవైపు ఆకర్షించుకోవాలని ప్రయత్నించినప్పుడు.. సమాజం మొత్తం ఆ అమ్మాయినే వేలెత్తి చూపుతుందని కంగనా అన్నారు. ఇలాంటి సందర్భాల్లో పురుషుడి తప్పును ఎవరూ చూడరని, కేవలం మహిళనే నిందిస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. "ఎదిగే వయసులో ఉన్న అమ్మాయిలతో పెళ్లయిన వ్యక్తి సంబంధం పెట్టుకోవాలని చూస్తే, అది అతని తప్పు కాదా? కానీ నింద మాత్రం అమ్మాయి మీదే వేస్తారు" అని ఆమె పేర్కొన్నారు.అదేవిధంగా, ఆధునిక డేటింగ్ యాప్ల వాడకంపై కూడా ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాటిని "సమాజంలోని మురికి కాలువలు"గా అభివర్ణించారు. ఆత్మవిశ్వాసం కొరవడిన వారు, ఇతరుల గుర్తింపు కోసం ఆరాటపడే వారే ఇలాంటి యాప్లను ఆశ్రయిస్తారని ఆమె విమర్శించారు. యువత తమ జీవిత భాగస్వాములను చదువుకునే రోజుల్లో గానీ, పెద్దలు కుదిర్చిన వివాహాల ద్వారా గానీ ఎంచుకోవడం ఉత్తమమని ఆమె సూచించారు.లివ్-ఇన్ రిలేషన్షిప్లు మహిళలకు ఏమాత్రం సురక్షితం కావని కంగనా స్పష్టం చేశారు. ఇలాంటి సహజీవనంలో అమ్మాయి గర్భం దాల్చితే కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లభించదని, దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. మొత్తంగా ఆధునిక సంబంధాల కన్నా సంప్రదాయ పద్ధతులే శ్రేయస్కరమనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com